RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 100 | శనివారం, మే 18, 2024 | పేజీలు : 4

## టీఎస్ పీజీఈసెట్.. రాత పరీక్షలో స్వల్ప మార్పులు

హైదరాబాద్: టీఎస్ పీజీఈసెట్–2024 రాత పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసినట్లు కన్వీనర్ డాక్టర్ ఏ అరుణ కుమారి శుక్రవారం వెల్లడించారు. గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలు, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షల నేపథ్యంలో... పీజీఈసెట్ రాత పరీక్షల షెడ్యూల్ లో మార్పులు చేసినట్లు స్పష్టం చేశారు. కాగా, సవరించిన షెడ్యూల్ ప్రకారం. జూన్ 6 నుంచి 9 వరకు జరగాల్సిన పీజీఈసెట్ రాత పరీక్షలను జూన్ 10 నుంచి 13 వరకు నిర్వహిస్తామని, అభ్యర్థులు ఈ స్వల్ప మార్పును గమనించాలని కన్వీనర్ అభ్యర్థించారు.

# భూమి పుత్రుడు పుస్తకాన్ని ఆవిష్కరించిన కేసీఆర్



హైదరాబాద్: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో మరో ఉద్యమంకు శ్రీకారం చుట్టాలని భారాస అధినేత కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో యుద్ధం ఇంకా మిగిలే ఉందని వెల్లడించారు. ఉద్యమ శక్తులను మరోసారి పునరేకికరణ చేసే కార్యాక్షేత్రానికి రూపకల్పన చేస్తున్నట్టు చెప్పారు. రాజకీయ, సామాజిక అంశాల్లో వచ్చిన మార్పులు, రాష్ట్ర ప్రగతి తదితర అంశాలపై తెలంగాణ ఉద్యమకారుడు గోసుల శ్రీనివాస్ యాదవ్ ఎడిటోరియల్ వ్యాసాలతో రూపకల్పన చేసిన సన్ ఆఫ్ ద సాయిల్.. భూమిపుత్రుడు పుస్తకాన్ని కేసీఆర్ శుక్రవారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత, బీఆర్ఎస్ అధినేత గోసుల శ్రీనివాస్‌యాదవ్‌ను కేసీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో, తెలంగాణ ప్రగతిని సాధారణ శైలిలో, ప్రజలకు అర్థమయ్యేలా వివరించారని కొనియాడారు. త్వరలో ఉద్యమ రచయితలతో ఒక సమావేశం పెట్టుకుందామని, రచయితలకు అన్ని విధాలుగా తోడుగా ఉంటానని స్పష్టం చేశారు. రచయితలు ప్రజల పక్షాన ఉండాలని కేసీఆర్ ఈ సందర్భంగా సూచించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో బావ వ్యాప్తితో ఉద్యమం ఉధృతమైందని, మరోసారి కవులు కళాకారులు ఏకం కావలసిన అవసరాన్ని గుర్తు చేశారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను ఇప్పటికి కాంగ్రెస్ సర్కారు తిరుగమన దిశగా ఆలోచించడాన్ని కెసిఆర్ తప్పు పట్టారు. కర్షకులు, కార్మికులు, నిరుద్యోగులు, వివిధ వర్గాలు కాంగ్రెస్‌తో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల తెలంగాణలో ప్రజలకు చిన్న ఇబ్బంది కలగకుండా చేశారని ఈ సందర్భంగా కేసీఆర్ తన పాలన మజిలీలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, గాదరి బాలమల్లు, శరత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

### నేడు రేవంత్ కేబినెట్ భేటీ...

# రుణ మాఫీపై మంత్రులతో సమీక్ష

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్ర కేబినేట్ సమావేశం శనివారం జరుగనుంది. రాష్ట్ర పునర్విభజన జరిగి పదేండ్లు పూర్తి కానుండటంతో పునర్విభజన చట్టానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్నవి, తెలంగాణ, ఏపీ మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై కేబినేట్? లో చర్చించనున్నారు. . విభజన చట్టంలోని హెడ్ క్వార్టర్స్ అనే పదానికి రెండు రాష్ట్రాలు భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కేవలం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయాన్ని మాత్రమే హెడ్ క్వార్టర్స్‌గా పరిగణించాలని తెలంగాణ అంటుండగా.. హైదరాబాద్?లోని సదరు కార్పొరేషన్ అన్ని కార్యాలయాలు, భవనాలను హెడ్ క్వార్టర్స్‌గా పరిగణించాలని ఆంధ్రప్రదేశ్ చెబుతోంది. ఈ వివాదాన్ని ముగించేందుకు కేంద్ర ప్రభుత్వం హెడ్ క్వార్టర్స్ అన్న పదానికి స్పష్టతనిస్తూ తెలంగాణ వాదనను సమర్థించగా, ఏపీ దీన్ని అంగీకరించలేదు. ఇలా రెండు రాష్ట్రాల మధ్య వివిధ అంశాలకు సంబంధించి భిన్నమైన అభిప్రాయాలు ఉండడంతో అవి అపరిష్కృతంగానే ఉండిపోయాయి. వీటిపైనే శనివారం జరగనున్న భేటీలో చర్చించనున్నారు. గస్ట్ 15లోపు రైతుల రుణమాఫీ చేసి తీరాలని ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించిన నిధుల సమీకరణపై చర్చించనున్నారు. ధాన్యం కొనుగోళ్ల పురోగతిని సమీక్షించి, వచ్చే ఖరీఫ్ పంటల ప్రణాళికపై చర్చ జరుగనుంది. రాష్ట్ర ఆదాయం పెంచుకునే దిశగా వనరుల సమీకరణ, ఆదాయ పెంపు ప్రత్యామ్నాయాలపై కేబినేట్‌లో చర్చిస్తారు. కుంగిపోయిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల రిపేర్లకు సంబంధించి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇటీవలే మధ్యంతర నివేదికను సమర్పించింది. నివేదికలోని సిఫారసులు, తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై




ఈ సమావేశంలో చర్చించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. జూన్ నుంచి కొత్త విద్యా సంవత్సరం ఆరంభమవుతుంది. స్కూల్, కాలేజీల ప్రారంభానికి ముందే అవసరమైన సన్నాహక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. విద్యార్థుల నమోదు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ల పంపిణీ తదితర అంశాలను చర్చించనున్నారు. కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ బ్యారేజీపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథార్టీ (ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చిన నివేదికపై ఆ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించనున్నారు. వర్షాకాలంలో బ్యారేజీకి మరింత నష్టం వాటిల్లకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అధికారులతో చర్చించనున్నారు.



## తీహార్ జైలులో కవితతో ఆర్ఎస్పీ, బాల్క సుమన్ ములాఖత్

న్యూఢిల్లీ: ఎమ్మెల్సీ కవితను బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బాల్క సుమన్ లు కలిశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు తీహార్ జైలులో ఉన్న కవితతో వీరిద్దరూ ములాఖాత్ అయ్యారు. అనంతరం తిరిగి ఢిల్లీలోని తెలంగాణ భవన్ కు చేరుకున్నారు. కాగా, గత మార్చిలో ఢిల్లీ లిక్కర్ స్కామ్ కు సంబంధించి మనిలాండరింగ్ కేసులో కవితను ఈడీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఢిల్లీ రౌస్ ఎవెన్యూ కోర్టు ఆమెకు జుడీషియన్ రిమాండ్ విధించడంతో తీహార్ జైలుకు తరలించారు. ఆ తర్వాత జైలులో ఉన్న సమయంలోనే కవితను సీబీఐ అరెస్టు చేసింది. ప్రస్తుతం ఈ రెండు కేసుల్లో తీహార్ జైలులో ఉన్నారు కవిత. పలుసార్లు బెయిల్ పిటిషన్ వేసిన కోర్టు కొట్టివేసింది. ఈక్రమంలో ఢిల్లీ హైకోర్టు ఈ నెల 24 కవిత బెయిల్ పిటిషన్ పై విచారించనుంది.



## ప్లాట్ వివాదంలో హైకోర్టు ఆశ్రయించిన ఎన్టీఆర్

హైదరాబాద్: భూ వివాదం వివాదంలో జూనియర్ ఎన్టీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఆయన 2003లో లక్ష్మీ అనే మహిళ వద్ద జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 75 లో ఉన్న ఒక ప్లాట్ కొన్నారు. అయితే.. ఆ ప్లాట్‌పై ఆమె అప్పటికే లోన్ తీసుకున్న విషయాన్ని దాచిపెట్టారు. దీంతో ప్లాట్‌ను స్వాధీనం చేసుకునేందుకు సదరు బ్యాంకులు ప్రయత్నించాయి. ఈ నేపథ్యంలో 2019లోనే బ్యాంకు మేనేజర్లపై ఎన్టీఆర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజాగా ఆయనకు వ్యతిరేకంగా డీఆర్టీ ఆర్డర్ రావడంతో హైకోర్టును ఆశ్రయించారు.

### అమ్మ ఆదర్శ పాఠశాల, వరి ధాన్యం కొనుగోళ్లపై...

## కీలక ఆదేశాలు జారీ

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి నేడు (శుక్రవారం) జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద చేపట్టిన పనుల పురోగతి, వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన అంశాలపై సీఎస్ శాంతి కుమారి సమీక్షించారు. దాంతో పాటు రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.



అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం పనులు వేగవంతం చేసి పూర్తి చేస్తున్నందుకు జిల్లా కలెక్టర్లను సీఎస్ శాంతి కుమారి అభినందించారు. వేసవి సెలవుల తరువాత పాఠశాలలు పునఃప్రారంభమయ్యే తేదీ జూన్ 12 లోగా వాటిని పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రం వ్యాప్తంగా తెరిచే రోజున ప్రతి విద్యార్థికి నోట్‌బుక్‌లు, పాఠ్యపుస్తకాలు, ఒక జత స్కూల్ యూనిఫాం అందేలా తగు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్లను ఆదేశించారు. చిన్నపాటి మరమ్మతు పనులు, విద్యుద్దీకరణ, మరుగుదొడ్లు, తాగునీరు, ఫర్నీచర్ పనులు నాణ్యతగా జరిగేలా పర్యవేక్షించాలని అధికారులను ఆమె ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు, సేకరణ గురించి సీఎస్ శాంతికుమారి ప్రస్తావిస్తూ బ్యాలెన్స్ ధాన్యాన్ని త్వరగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి మిల్లులకు వేగంగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి కొంత మంది జిల్లాల కలెక్టర్లు తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. ఇదే విధానాన్ని అనుకరించి తెలంగాణ వ్యాప్తంగా రైతులు నష్టపోకుండా ఉండేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సీఎస్ శాంతి కుమారి సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వెంకటేశం, పంచాయత్ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# దేశాన్ని లూటీ చేసిన కాంగ్రెస్: అమిత్ షా



న్యూఢిల్లీ: దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ ప్రజలను లూటీ చేసిందని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఆరోపించారు. శుక్రవారం ఉత్తర్ ప్రదేశ్‌లోని రాయబరేలి(దినేష్ ప్రతాప్ సింగ్), అమేథీ(స్మృతి ఇరానీ) లోక్‌సభ నియోజకవర్గాలలో బిజెపి అభ్యర్థుల తరపున ఆయన ప్రచారం నిర్వహిస్తూ బిజెపి బభ్యర్థులు ఇద్దరూ చాలా కష్టపడుతున్నారని, ఈ రెండు నియోజకవర్గాలలో వారి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. చాలా కాలం నిరీక్షణ తర్వాత అయోధ్యలో రామ మందిరం మనకు లభించిందని, అయితే కాంగ్రెస్ మాత్రం సరైన పద్ధతిలో ప్రాణ ప్రతిష్ట జరగలేదని కాంగ్రెస్ నిందిస్తోందని ఆయన చెప్పారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అయోధ్య రామాలయానికి బాబ్రీ తాళం పడుతుందని ఆయన ఆరోపించారు. ఇండియా కూటమి పార్టీలు వారసత్వ రాజకీయాలు చేస్తున్నాయి. తన కుమారుడు ముఖ్యమంత్రి కావాలని లాలూ ప్రసాద్ కోరుకుంటున్నారు. తన మేనల్లుడు సిఎం కావాలని మమతా బెనర్జీ భావిస్తున్నారు. తన కుమారుడు ప్రధాని కావాలని సోనియా గాంధీ ఆశిస్తున్నారు. రాయబరేలి, అమేథీ సీట్లు తమవేనని ఆ కుటుంబం చెప్పుకుంటోంది. దీన్ని నిర్ణయించేంది ప్రజలేనని నేను భావిస్తున్నాను. ఏ ఒక్క కుటుంబానికి ఏ సీటు రిజర్వ్ చేయలేదు అని అమిత్ షా వ్యాఖ్యానించారు. 370వ అధికరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఏనాడూ చర్యలు తీసుకోలేదని, కాని ప్రధాని మోడీ ఆ అధికరణను రదుచేసి దేశంలో తీవ్రవాదాన్ని కట్టడి చేశారని ఆయన చెప్పారు. పాక్ ఆక్రమిత కశ్మీరుకు భారత్‌కే చెందుతుందని, ఈ విషయంలో తాము భయపడే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్‌ను అవినీతి పార్టీగా ఆయన అభివర్ణిస్తూ అనేక సంవత్సరాలపాటు ఆ పార్టీ దేశాన్ని లూటీ చేసిందని, అవినీతికి పాల్పడిన నాయకులందరినీ మోడీ ప్రభుత్వం జైలుకు పంపుతుందని అమిత్ షా ప్రకటించారు. ఉత్తర్ ప్రదేశ్‌లో సాగుతున్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని ఆయన కీర్తిస్తూ ప్రధాని మోడీ నాయకత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని ఆయన చెప్పారు. యుపికి 14 ఎక్స్‌ప్రెస్‌వేలు, ఒక మెట్రో వ్యవస్థ, మెడికల్ కాలేజీలు, ఫిల్మ్ సిటీ, టాయ్ పార్కు వంటివి అనేకం వచ్చాయని ఆయన తెలిపారు. రాష్ట్రంలో గూండాలను ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తరిమికొట్టారని ఆయన చెప్పారు. కాగా..గాంధీ కుటుంబానికి కంచుకోటలుగా ఉన్న రాయబరేలి, అమేథీ నియోజకవర్గాలపై ప్రస్తుతం అందరి దృష్టి ఉంది. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహించిన రాయబరేలి నుంచి ఈసారి రాహుల్ గాంధీ పోటీ చేస్తుండగా గత ఎన్నికల్లో రాహుల్ ఓటమి చెందిన అమేథీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గాంధీ కుటుంబానికి విధేయుడైన కిషోరీ లాల్ శర్మ పోటీ చేస్తున్నారు. అమేథీలో బిజెపి అభ్యర్థిగా కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ పోటీ చేస్తున్నారు.

## సంపాదకీయం

# పోషకాహార లోపమే వ్యాధులకు మూలం...

ఈరోజుల్లో అన్నం విలువ కొంత మందికే తెలుస్తుంది. ఎందుకంటే అన్నం తినేవాడి కన్నా దానిని పండించే వారికే దాని విలువ తెలుస్తుంది. ఆహారం పారేయడానికి ఒక్క నిమిషం చాలు, కాని ఆ ఆహారాన్ని పండించ డానికి కనీసం మూడు నెలలు పడుతుంది. ఆ విషయం తెలియక చాలా మంది దానిని వృధా చేస్తారు. ఒకరు రోజంతా కష్టపడి కూలి పనులు చేసి డబ్బు సంపాదిస్తారు. ఇంకొకరు రోజంతా ఏసీ గదుల్లో కంప్యూటర్ల ముందు కూర్చొని కుస్తీ పడతారు. ఎవరు ఎలా కష్టపడినా... కడుపు నింపు కోవడానికే. కోటి విద్యలు కూటి కోరకే... అని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. ముందు కడుపు నిండాకే మనిషి మరో దాని గురించి ఆలోచిస్తున్నాడు. ప్రస్తుతం కనీస అవసరాల కిందకి చాలా వచ్చాయి. ఎన్ని ఆ జాబితాలో చేరినా మొదటి స్థానంలో ఆహారమే ఉంటుంది. ఎందుకంటే... ఆహారం లేకుండా సృష్టిలో ఏ ప్రాణి జీవించలేదు కాబట్టి. కానీ ప్రస్తుత రోజుల్లో మనుషులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నా కూడా కడుపు నిండా భోజనం చేయడం లేదు. బరువు పెరుగు తామనో, లావు అయి పోతామనో ఇలా కారణాలు చెబుతున్నారు. కొందరేమో తినడానికి తిండి లేక అవస్తలు పడుతున్నారు. ఈ రెండు కారణాల వల్ల పోషకాహార లోపాన్ని ఎదురు కుంటున్న వారు చాలా మంది ఉన్నారు. ఎలాంటి ఆహారం తినాలనే విషయాలపై అవగాహన అవసరం. ప్రతి ఒక్కరికీ ఎలాంటి జబ్బుల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలతో పాటు గింజలు, విత్తనాలు, పల్లీలు, శనగలు, ఉలవలు, బొబ్బర్లు, జీడిపప్పు, బాదం పప్పు, వాల్ నట్స్ వంటిని ప్రతి రోజూ తీసుకోవాలి. భారతీయులు రోజూ కనీసం 400 గ్రాముల కూరగాయలు, పండ్లు తీసుకోవాలని భారత పోషకాహార సంస్థ చెబుతోంది. రాగులు, జొన్నలు, వరి, గోధుమ వంటి ధాన్యాన్ని కూడా ఎక్కువగా తీసుకోవాలి. మరీ ప్రత్యేకంగా కొవ్వులు, చెక్కర, ఉప్పు వాడకాన్ని చాలా తక్కువగా వాడటం ఉత్తమం. 50శాతం కేలరీలు అందిస్తున్న పంటలు 8 రకాలు ఉన్నాయి. బార్లీ, బీన్స్, వేరుశెనగ, మొక్కజొన్న, వరి, జొన్న, గోధుమలు వీలైనంత ఎక్కువగా ఆహారంలో భాగం చేసుకోవాలి. బయట లభించే ఆహారాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఫాస్ట్ ఫుడ్ అసలు తినకపోవడం చాలా మంచిది. చిన్నారులకు కనీసం 9నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి. పుట్టగానే డబ్బా పాలను అలవాటు చేస్తే.. అప్పటి నుంచే వారిలో పోషకాహార లోపం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారం తీసుకోవడంతో పాటు తగినంత వ్యాయామం చేయడం కూడా చాలా అవసరం. మన భూమి మీద మనిషి తినగలిగే మొక్కల జాతుల సంఖ్య దాదాపు 30 వేలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 852 మిలియన్ల మంది దీర్ఘకాలంగా అతి పేదరికం కారణంగా ఆకలితో అలమటిస్తున్నారు. ఈ సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. అందుకు కారణాలు అనేకం. విపరీతమైన జనాభా పెరుగుదల, వాతావరణ మార్పు, ఆహార ధాన్యాలను జీవ ఇంధనాల కోసం ఉపయోగించడం, మౌలిక ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గించి లాభదాయకమైన వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపడం... ఇలా ఎన్నో కారణాలు. వీటి పర్యవసానంగా ఆహార ధాన్యాల ధరలు అందుబాటు లోకి లేనంతగా పెరగడం మరో సమస్య. ప్రపంచ జనాభాలో దాదాపు సగం పట్టణాలు, నగరాలలో జీవిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 70 శాతం కంటే ఎక్కువ మంది పల్లెల్లో నివసిస్తున్నారు. అయినా అనేక కారణాలవల్ల వ్యవసాయం కుంటుపడింది. ఆఫ్రికాలో కొన్ని దేశాలలో కరువు నిత్యం తాండవిస్తూనే ఉంది. ఆసియాలో దాదాపు 60 శాతం జనాభా పోషకాహార లోపంతో బాధ పడుతున్నారు. అదే ఆఫ్రికాలో ఆ శాతం 75 దాటింది. దాదాపు 22 దేశాలలో (వాటిలో 16 ఆఫ్రికాలోవే) పోషకాహార లోపం 35 శాతం దాటిందని తేలింది. భారతావనిలో విస్తారమైన కోట్లాది ఎకరాల భూములుండి, లక్షలాది ఎకరాల పంట భూములలో పప్పు ధాన్యాలు, తదితర ఆహార ధాన్యాలతో విలసిల్లింది. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన మనదేశం స్వాతంత్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, పాలకుల పేదరిక నిర్మూలనా పథకాలు, లక్షల, కోట్ల పంచ వర్ష ప్రణాళికలు ఈ ఏడు దశాబ్దాల్లో పేదరికం ఆకలి తీర్చలేదు. పేదలు దరిద్రులుగా, ధనికులు బిలియనీర్లు, ట్రిలియనీర్లు కావటానికి ఉపయోగపడ్డాయి తప్ప, సగటు మనిషి ఆకలి తీర్చటంలో విఫలమయ్యాయి. దేశ స్థూల జాతీయాదాయం చూపి చంకలు గుద్దుకుంటున్న పాలకులు జాతీయాదాయంతో పాటు, జాతులకు ఆహార భద్రత కల్పించటంలో విఫలమయ్యారు. దీనికి ఉదాహరణ పనికి ఆహార పథకంలో అవినీతి, పేదలకిచ్చే సబ్సిడి ఆహార భద్రత కార్డుల్లో అవినీతి, ఆహార అవసరాలు తీర్చుట గురించి అవకాశం కల్పించినా రైస్‌మిల్లర్ల మాయాజాలం వెరసి అవినీతి ఎందెందు వెతికినా అందందు కలదన్నట్టు అవినీతి బీజాలు మహా వృక్షాలై పాలకుల ప్రజాస్వామ్య వ్యవస్థను వెక్కిరిస్తున్నాయి.

# హ్యాట్రిక్ కొట్టబోతున్నాం



బారాబంకి:ఎన్నికల్లో దేశం కోసం పనిచేసే ఎన్డీఏ, దేశంలో అస్థిరతను పెంచే ఇండియా కూటమి మధ్య పోరు జరుగుతోందని ప్రధాని మోడీ అన్నారు. దేశ ప్రజలు బీజేపీవైపే ఉన్నారని.. ఏన్డీఏ విజయం ఖాయమని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉత్తర ప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాన మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మా ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టబోతుందన్నారు. గెలిచినత పేదల కోసం ఎన్నో నిర్ణయాలు తీసుకోబోతున్నామని చెప్పారు. మీ ఓటు వల్లే రామమందిరం నిర్మాణం జరిగిందన్నారు. బలమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం వల్లే రామమందిరం సాధ్యమైందని ప్రధాని అన్నారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపిస్తే.. వాళ్ళ మోడీని తిట్టడమే పనిగా పెట్టుకుంటారన్నారు. తిట్టడం కోసం మనం ఎరినైనా ఎన్నుకుంటామా?.. అలాంటి వాళ్ల వల్ల పనులు జరుగుతాయా?.. మనకు పనులు చేసే వ్యక్తి కావాలని మోడీ అన్నారు. హైదరాబాద్ ఎల్లారెడ్డిగూడలో దారుణం జరిగింది. ప్రియుడి మోజులో కట్టుకున్న భార్తను సుఫారీ ఇచ్చి హత్యచేయించింది ఓ భార్య. గుండెపోటుతో మరణించాడని ఎవ్వరికీ అనుమానం రాకుండా దహనసంస్కారాలు కూడా చేసింది. ఈ ఘటన జరిగిన మూడు నెలల తర్వాత నిందితుడు లొంగిపోవడంతో అసలు విషయం బయటపడింది. మధురానగర్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎహైదరాబాద్ లోని ఎల్లారెడ్డి గూడలో జయప్రకాశనగర్ లోని శిఖర అపార్డ్ మెంట్ లో నివాసం ఉండే సీసీ కెమెరా టెక్నీషియన్ విజయ్ కుమార్(40)కు భార్య శ్రీలక్ష్మి (33), ఇద్దరు మగ పిల్లలు (9, 8 ఏండ్లు) ఉన్నారు. కొంత కాలంగా బోరబండకు చెందిన రాజేశ్ (30)తో శ్రీలక్ష్మి వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తోంది.

వీళ్ల బంధానికి తన భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన శ్రీలక్ష్మి ప్రియుడితో కలిసి మర్డర్ కు ప్లాన్ చేసింది. భర్త పేరు మీద మేడ్చల్, ఎల్లారెడ్డిగూడలో సొంత ఇండ్లు ఉన్నాయి. భర్తను హత్య చేయించి ఎంజాయ్ చేద్దాం అనుకుంది. ఎల్లారెడ్డిగూడలో ఉంటున్న ఇల్లు వాస్తు బాగో లేదని చెప్పి శిఖర అపార్టమెంట్ కు మకాం మార్పించి మర్డర్ కు ప్లాన్ చేసింది.

## విదేశీ పర్యటనల కోసం టికెట్లు బుక్ చేసుకున్నారు

లోక్‌సభ ఎన్నికల తర్వాత విదేవీ పర్యటనల కోసం ఇద్దరు యువ నాయకులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని తనకు తెలిసిందని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీతోపాటు రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్‌పై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని ఫతేపూర్ లోక్‌సభ నియోజకవర్గంలో శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించిన ప్రధాని మోదీ రాహుల్, అఖిలేష్ యాదవ్‌ల పేర్లను నేరుగా ప్రస్తావించకుండా మాట్లాడుతూ కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీల కలలు చెదిరిపోయాయని, జూన్ 4 తర్వాత ఓటమి నిందను ఎవరిపై వేయాలని ఆ రెండు పార్టీలు ఆలోచిస్తున్నాయని అన్నారు. ఫలితాల తర్వాత విదేశీ ప్రయాణానికి వారిద్దరూ టికెట్లు బుక్ చేసుకున్నట్లు తనకు ఒకరు చెప్పారని కూడా ఆయన అన్నారు. ఉత్తర్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ మనుగడే లేదని, అయినప్పటికీ ఒక కుటుంబ గౌరవాన్ని కాపాడేందుకు యావత్ కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు.

## మెదక్ లో పెరిగిన పోలింగ్ ఎవరికి లాభం... ఎవరికి నష్టం



P Venkatram Reddy Neelam Madhu Mudiraj M Raghunandan Rao

**మెదక్,:** పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి అందరి దృష్టి ఆ నియోజకవర్గంపైనే ఉంది. అక్కడ టికెట్ ఎవరికి ఇస్తారు.. బరిలో ఎవరు నిలుస్తారు.. ఇలా చాలా చర్చ జరిగింది. పోలింగ్ ముగిసింది.. ఇక ఇప్పుడు ఆ పార్లమెంట్ స్థానంలో ఏపార్టీ జెండా ఎగరేస్తుంది? ఏ అభ్యర్థి గెలిచే అవకాశం ఉంది? ఇలా కొత్త చర్చ జరుగుతోంది. ఎంపీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుండి ఎంతోమందిని ఆకర్షించిన మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో తాజాగా ఇప్పుడు గెలిచేది ఎవరు అనే దానిపై జోరుగా చర్చ సాగుతోంది. మెదక్ పార్లమెంటుపై ఇంత చర్చ జరగడానికి కారణం గతంలో ఇక్కడ రాజకీయ ఉద్దండులు ఎంపీ బరిలో నిలిచి దేశ రాజకీయాలను మర్చారు. మెదక్ పార్లమెంట్ అంటేనే ఒక మినీ ఇండియా. వివిధ రాష్ట్రాల ప్రజలు ఇక్కడ నివసిస్తూ ఉంటారు. ఇక్కడి నుండి ఇందిరా గాంధీ ఎంపీగా పోటీ చేసి దేశ ప్రధాని కూడా అయ్యారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఇక్కడి నుండి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. అందుకే ఈ స్థానానికి అంతటి క్రేజ్. మొన్న జరిగిన ఎంపీ ఎన్నికల్లో ఈ మెదక్ పార్లమెంట్ నుండి బీఆర్ఎస్ నుండి వెంకట్ రాం రెడ్డి.. కాంగ్రెస్ నుండి నీలం మధు.. బీజేపీ నుండి రఘునందన్ బరిలో నిలిచారు. ఈ ముగ్గురు కూడా ఎన్నికల్లో గెలవడానికి తీవ్రంగా కృషి చేసారు. ఆయా పార్టీల జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలు కూడా వారి అభ్యర్థుల గెలుపుకోసం జోరుగా ప్రచారం నిర్వహించారు. ఎలాగైనా సరే మెదక్ పార్లమెంట్?పై జెండా పాతలని కసితో పనిచేశాయి మూడు ప్రధాన పార్టీలు. అందుకే చివరికి వరకు ఇక్కడ త్రిముఖ పోరే కొనసాగిందిదీనికి తోడు ఈసారి పోలింగ్ పర్సంటేజ్ కూడా బాగా పెరిగి.. 75.90 పోలింగ్ నమోదు అయ్యింది. గత ఎన్నికల్లో జరిగిన పోలింగ్ పర్సంటేజ్?తో చుస్తే ఈసారి 3.38 శాతం పెరిగింది. పెరిగిన పోలింగ్ ఎవరికి ప్లస్ అవుతుంది. ఈ త్రిముఖ పోరులో ఎవరు గెలుస్తారు అనే దాని పై బెట్టింగ్?లు కూడా జోరుగా నడుస్తున్నాయి. మెదక్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా అందులో ఆరు స్థానాలను బీఆర్ఎస్ పార్టీ గెలిచింది. ఒక మెదక్ అసెంబ్లీ మాత్రం కాంగ్రెస్ దక్కించుకుంది. మొదటి నుండి కూడా బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఇక్కడ నల్లేరు మీద నడకే అనే ప్రచారం జరిగింది. కానీ కాంగ్రెస్, బీజేపీ కూడా ఈ సీట్?ను చాలా సీరియస్ గానే తీసుకున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ మెదక్ సీట్ దక్కించుకోవాలని కసిగా పనిచేసింది. దుబ్బాక అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన రఘునందన్ మెదక్ ఎంపీగా గెలవాలని గట్టిగా పనిచేశారు. బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటగా ఉన్న మెదక్ పార్లమెంట్ స్థానంను దక్కించుకివడానికి కాంగ్రెస్, బీజేపి పార్టీలు బాగానే కృషి చేసాయి. అంతే స్థాయిలో బీఆర్ఎస్ పార్టీ కూడా వ్యూహాలు చేస్తూ ముందుకు సాగింది. బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం మాజీ మంత్రి హరీష్ రావు అన్ని తానై ప్రచారం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఈ పార్లమెంటు పరిధిలో తన బస్సు యాత్రను నాలుగు నియోజకవర్గాల్ల కవర్ అయ్యేలా ప్లాన్ చేసి, ప్రచారం నిర్వహించారు. ఇక మెదక్ పార్లమెంట్ పరిధిలో కీలకమైన నియోజకవర్గం సిద్దిపేట నియోజకవర్గం. ఇక్కడి ప్రజలు ఏ పార్టీ వైపు నిలిచారు.? అనే చర్చ జోరుగా సాగుతోంది. తెలంగాణ ఉద్యమం పురుడు పోసుకున్న నాటి నుంచి మెదక్ పార్లమెంట్?కు జరిగిన ఎన్నికల ఫలితాలను గమనిస్తే సిద్దిపేట నియోజకవర్గ ప్రజలు తీర్పే కీలకంగా ఉంటుంది. సిద్దిపేట ప్రజలు ఏ పార్టీ వైపు నిలిస్తే ఆ పార్టీ గెలుపొందడం విశేషం. ఆ సెంటిమెంట్ దృష్ట్యా తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారం కేసీఆర్ చివరి సభను ఇక్కడే ఏర్పాటు చేశారు. సిద్దిపేట నియోజకవర్గ ప్రజలు ఏ పార్టీ వైపు నిలిచారన్న అంశంపై జోరుగా బెట్టింగ్?లు సాగుతున్నాయి. మెదక్ పార్లమెంట్ పరిధిలోని సిద్దిపేట నియోజక వర్గంలో 2,37,591 మంది ఓటర్లకు గాను 1,74,969 (73.64శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దుబ్బాక నియోజకవర్గంలో 2,00,125 మంది ఓటర్లకు గాను 1,64,952(82.42 శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## ఆర్టీసీలో ఉద్యోగుల జాతర




**హైదరాబాద్:** తెలంగాణ ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్ల కొరత తీవ్రంగా వేధిస్తుంది. రేవంత్ సర్కార్ తీసుకొచ్చిన మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపేందుకు సరిపోయేంత సిబ్బంది లేక ఆర్టీసీ తీవ్ర ఇబ్బందులు పడుతోంది. దీంతో నిత్యం ప్రజల నుంచి ఆర్టీసీ విమర్శలను ఎదుర్కొవాల్సి వస్తుంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలో ప్రస్తుతం 2 వేల డ్రైవర్ పోస్టులతోపాటు, మరికొన్ని కండక్టర్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరత కారణంగా నిత్యం బస్సుల రాకపోకలకు అధికారులు సతమతం అవుతున్నారు. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు ఆర్టీసీ ఓ నిర్ణయానికి వచ్చింది. వీలైనంత త్వరగా సిబ్బంది నియామకాలు చేపట్టాలని ఆర్టీసీ భావిస్తోంది. ఈ మేరకు డ్రైవర్, కండక్టర్ పోస్టులను విడివిడిగాకాకుండా.. డ్రైవర్ కమ్ కండక్టర్ పోస్టులను భర్తీ చేసేందుకు కసరత్తులు చేస్తోంది.అయితే ఈ పోస్టుల ద్వారా తీసుకున్న ఉద్యోగులను జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు వెళ్లే సర్వీసుల్లో డ్రైవర్, కండక్టర్ డ్యూటీ ఒకరే చేసేలా నియామకాలు చేపట్టనున్నట్టు సమాచారం. అంటే డ్రైవర్ ఉద్యోగంలోకి వచ్చే వ్యక్తి కండక్టర్ డ్యూటీ కూడా చేయాల్సి ఉంటుందన్నమాట. ఈ మేరకు ఆర్టీసీ నిబంధనలను రూపొందిస్తుంది. దీనిపై సంస్థ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. తద్వారా ఖర్చు కూడా తగ్గుతుందనే భావన అధికారుల్లో బలంగా ఏర్పడటంతో ఈ దిశగా అడుగులు వేస్తున్నట్టు సమాచారం.అలాగే హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లోని విద్యాసంస్థల సమయపాలన ఒకేలా ఉండేలా మార్చాలని కోరుతూ ఆర్టీసీ ఆయా విద్యాసంస్థలకు లేఖలు రాసింది. అందుకు అనుగుణంగా 1500 బస్సులను కాలేజీలు, విద్యాసంస్థల సమయాల్లో నడిపేందుకు ఆర్టీసీ సన్నద్ధమవుతుంది.

# క్యాంప్ పాలిటిక్స్ షురూ కీలక నేతల వరుస భేటీలు




**హైదరాబాద్:** తెలంగాణలో లోక్ సభ ఎన్నికలు పూర్తైపోయాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇక నుంచి పూర్తి స్థాయిలో పరిపాలనపై దృష్టిపెడుతానని చెబుతున్నారు. రుణమాఫీ,కాంగ్రెస్ హామీల పూర్తిస్థాయి అమలు, మండలాలు, జిల్లాల రేషనైలేషన్ వంటి అంశాలపై ఫోకస్ పెడుతానని అంటున్నారు. అయితే టీ-కాంగ్రెస్ బాస్‌గా,రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చేసిన ఈ కామెంట్స్ సంగతి అటుంచితే..ఆ పార్టీలో కొన్ని కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకులు,మంత్రి వర్గానికి చెందిన కొందరు ముఖ్యుల వ్యవహార శైలితో అప్పుడే కాంగ్రెస్‌లో క్యాంపు రాజకీయాలు మొదలయ్యాయనే చర్చ జోరుగా సాగుతోంది. పార్టీకి సంబంధించిన కీలక నేతలు రహస్యంగా భేటీ అవుతుండడంతో..ఈ ప్రచారానికి మరింత ప్రయార్టీ ఏర్పడినట్లైంది.రాష్ట్రంలో పార్లమెంట్ ఎలక్షన్స్ ముగిసిన వెంటనే రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క,మరో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును ఆయన స్వంత ఊరు ధన్వాడలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారివురు సుదీర్ఘ మంతనాలు జరిపారు. అదే టైంలో ఎన్నికలు ముగిసిన వెంటనే రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలతో పాటు తన అనుయాయులతో కేరళ వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం మంత్రుల భేటీలు,టూర్ల గురించి అస్సలు మాట్లాడడం లేదు. ఎన్నికలు పూర్తైనందున ఇక నుంచి పరిపాలనపైనే పూర్తిస్థాయిలో నజర్ పెట్టనున్నట్లు చెప్పుకొస్తున్నారు. అయితే రేవంత్ రెడ్డి ఈ రకమైన స్టేట్ మెంట్స్ ఇస్తున్నప్పుడు..భట్టీ-దుద్దిళ్ల భేటీ,పొంగులేటి కేరళ టూర్ వెనక ఉన్న మతలబేంటి అనే అంశమే ఇప్పుడు రాజకీయంగా హాట్ టాపిక్ మారింది.లోక్ సభ ఎన్నికలకు ముందు టీ-బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తామేమీ కూల్చబోమని..కానీ,దాని అంతల అదే కూలిపోతే మాత్రం మేమేం చేయలేమని చెప్పుకొచ్చారు. ఇక రెండు రోజుల క్రితం బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కూడా కీలక వ్యాఖ్యలు చేయడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. రేవంత్ సర్కార్ ఆగస్టు సంక్షోభాన్ని ఎదుర్కోవచ్చని వెల్లడించారు. గతంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ఇవే సంకేతాలిచ్చారు. దీంతో తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలు పూర్తికా గానే..కాంగ్రెస్ సర్కార్‌కు ఇబ్బందులు తప్పకపోవచ్చనే ప్రచారం జోరుగానే ఉంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో ఉన్న మంత్రులు కూడా క్యాంపు రాజకీయాలు నడుపుతుండడంపై ఆసక్తికర చర్చ మొదలైంది. పొంగులేటి కేరళ వెళ్లడం..విక్రమార్క,శ్రీధర్ బాబు భేటీ కావడంతో..అప్పుడే సర్కార్‌లో లుకలుకలు మొదలయ్యాయనే టాక్ వినిపిస్తోంది. వెరసి టీ-బీజేపీ నేతల స్టేట్ మెంట్లు..ఇటు అమాత్యుల వరుస భేటీలతో రేవంత్ సర్కార్‌కు ఏదో ఒక రకంగా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడవచ్చనే డిస్కషన్ మాత్రం జరుగుతోంది.అయితే ఇదే అంశాన్ని టీ-పీసీసీ నేతల వద్ద ప్రస్తావించినప్పుడు మాత్రం తమ పార్టీలో అలాంటి క్యాంపు రాజకీయాలేం నడవడం లేదని కొట్టిపారేస్తున్నారు. కేవలం రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున పొంగులేటి విడిది కోసం కేరళకు వెళ్లి ఉంటారని చెబుతున్నారు. అలాగే భట్టివిక్రమార్క-దుద్దిళ్ల శ్రీధర్ బాబు భేటీ వెనక కూడా అంతలా అంతర్యమేమీ లేదని కొట్టిపారేస్తున్నారు. అయితే కాంగ్రెస్ నేతల వివరణలు ఎలా ఉన్నా..ముమ్మందు ఏదో జరగబోతుందనే అంచనాను రాజకీయాలు విశ్లేషకులు వేస్తున్నారు. అయితే ఎవరి ఎక్స్‌పెక్టేషన్స్ ఎలా ఉన్నా..చూడాలి మరీ మరికొద్ది నెలల్లో ఏం జరగనుందనేది.

## ఖమ్మం టౌన్ లో రాకేష్ రెడ్డి ప్రచారం



**ఖమ్మం:** ఉమ్మడి వరంగల్ - ఖమ్మం - నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అనుముల రాకేష్ రెడ్డి ఖమ్మంలో ప్రచారం చేసారు. ఎస్సార్ అండ్ బీజీఎన్నార్ డిగ్రీ కళాశాల గ్రౌండ్లో జిల్లా అధ్యక్షులు తాతా మధు తో కలిసి వాకర్స్ ను ఓటు అభ్యర్థించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదట ప్రాధాన్యత ఓటు 3వ నెంబర్ పై వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను అనగ తొక్కుతుందన్నారు. సమస్యలపై ప్రశ్నించే గొంతులను నొక్కి ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు నాగరాజు,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్ జె సి కృష్ణ, కార్పొరేటర్లు,బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం ఫెర్రీ లో హై టెన్షన్ ఇసుక దిబ్బలు తగిలి నది మధ్యలో నిలిచిన లాంచీ

**విజయవాడ:** ఇబ్రహీంపట్నం దగ్గర కృష్ణా నదిలో ఒక లాంచీ ఇసుక దిబ్బలు తగిలి నది మధ్యలో నిలిచిపోయింది. 25మంది ప్రయాణికులు తో రాయపూడి నుండి బయలు దేరిన లాంచీ, లాంచీ ఇసుక దిబ్బలు తాకడం తో ఆగిపోయింది. విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు స్థానిక మత్యకారుల సహకారం తో యుద్ధ ప్రాతిపదికన పడవలతో ప్రయాణికులను తరలించే ప్రక్రియ ప్రారంభించారు. ప్రయాణికులు తిరుగు ప్రయాణం అయినట్లు సమాచారం రావడం తో ప్రయాణికుల కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. లాంచీ ఇసుక దిబ్బలు డీ కొట్టిన ఘటన లో ఎవరికి ఎలాంటి ప్రమాదం లేకపోవడం తో పెను ప్రమాదం తప్పినట్లు అయింది.

## మావోయిస్టుల పేరుతో ఆదివాసులను చంపుతున్నారు

### - లేఖ విడుదల చేసిన మావోయిస్టులు



**భద్రాద్రి కొత్తగూడెం:** మావోయిస్టు పార్టీ నిర్మూలన పేరుతో బస్తర్ లో ఆదివాసీలపై జరుగుతున్న దాడులను ఖండించాలని పిలుపునిస్తూ మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం,అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ లేఖ విడుదల చేసారు. అమాయక ఆదివాసీలను మావోయిస్టుల పేరుతో దొరకబట్టి చంపుతున్నారని ఆరోపించారు. ఈ మధ్యకాలంలో జరిగిన ఎన్కౌంటర్లలో మృతి చెందిన 103 మందిలో 60 మంది మహిళలు వృద్ధులే ఉన్నారని లేఖలో పేర్కొన్నారు. ఆదివాసీల త్యాగాలతో రక్తంతో తడచిన అడవులలో రహదారులు వేస్తూ అపారమైన అటవీ సంపదను తరలిస్తున్నారు. గత ఏడాదికాలంగా చతిస్గడ్ అటవీ ప్రాంతంలోని ఆదివాసీ గ్రామాలపై డ్రోన్ల ద్వారా బాంబు దాడులు చేస్తూ ఆదివాసి ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నారు. ఛత్తీస్గఢ్ రాష్ట్రంలో ఆదివాసి ముఖ్యమంత్రి ఉన్నప్పటికీ ఆదివాసీలకు న్యాయం జరగడంలేదు. కగార్ దాడిలో భాగంగా ప్రజలపై క్రూరమైన దాడి చేస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని కార్మిక, కర్షక,మేధావి, విద్యార్థి, మహిళా వర్గాలకు పిలుపునిచ్చారు.

## తంగళ్ళపల్లి మండలంలో పిడుగుపాటుతో ఒకరు మృతి

### - వర్షానికి జలమయమైన పాత బస్టాండ్ - ప్రాంతం నీట మునిగిన వాహనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాదచారులు




**సిరిసిల్ల:** సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్, సంజీవయ్య నగర్ ప్రాంతం గురువారం కురిసిన కొద్దిపాటి వర్షానికి జలమయమయ్యాయి. సుమారు అరగంటసేపు కురిసిన వర్షానికే సంజీవయ్య నగర్ కమాన్ ప్రాంతంలో వాహనాలు నీట మునిగిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు ప్రైవేటు ఆసుపత్రుల ప్రాంతం కావడంతో ఆసుపత్రులకు వచ్చే రోగులతో పాటు వారి బంధువులు వరదనీటిలో నడవలేక అసహనానికి గురవుతున్నారు. పాత బస్టాండు ప్రాంతం కూడా వర్షపు నీటితో కొద్దిసేపు జలమయమైంది.బస్టాండ్ ఎదురుగా ఉన్న రుచి హోటల్ ముందు భారీగా వరద నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తంగళ్ళపల్లి మండలంలో పిడుగుపాటుతో ఒకరు మృతి చెందారు. -ప్రతిసారి ఇదే పరిస్థితి వర్షం పడ్డ ప్రతిసారి సిరిసిల్లలోని పాత బస్టాండ్, సంజీవయ్య నగర్ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇంకాస్త భారీ వర్షం అయితే పట్టణంలోని వెంకంపేట, ప్రగతి నగర్ వాసుల ఇళ్లలోకి వరద నీరు ముంచేత్తుతోంది.మున్సిపల్ అధికారులు ప్రణాళిక లోపంతో ఇష్టారాజ్యంగా నిర్మించిన మురికి కాలువలు,రోడ్ల వల్ల ఈ పరిస్థితి దాపురించింది. గతంలో ఎంతో భారీ వర్షం పడితే కానీ ముంపు మాట వినని సిరిసిల్ల ప్రాంతం ఇప్పుడు చిన్నవర్షానికి గజగజలాడిపోతోంది. ముంపు ప్రభావిత ప్రాంతాలైన సంజీవయ్య నగర్, ప్రగతి నగర్, అశోక్ నగర్,వెంకంపేట, పాత బస్టాండ్ ఏరియా,శ్రీనగర్ కాలనీలో అయితే వర్షం పడితే చాలు వరద ముంచుకొస్తుందేమోనన్నఆందోళనలతో భయభ్రాంతులకు గురవుతున్నారు. గత మూడు సంవత్సరాలుగా సిరిసిల్లలో ఇదే పరిస్థితి కొనసాగుతోంది.వరదలు అడ్డుకునేందుకు మునిసిపల్ శాఖ చేపట్టిన పనులు ఏమి సత్ఫలితాలను ఇవ్వడం లేదు.

## ఎర్రగుంట్ల లో నీరు కలుషితం..పలువురు ఆసుపత్రిపాలు

**నంద్యాల:** నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం ఎర్రగుంట్ల గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ కలుషితం కావడంతో మంది 50 మంది అతిసారా బారిన పడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులందరూ నంద్యాల జిజిహెచ్ లో చికిత్స పొందుతున్నారు.గ్రామంలో రెండు మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటితో పాటు కొన్ని ప్రాంతాలకు బోరు ద్వారా వీటిని సనాఫరా చేస్తున్నారు.కానీ వాటర్ ప్లాంట్ ను సకాలంలో శుభ్రం చేయకపోవడంతో నీరు కలుషితమైంది. రోజు లాగే ఈ నీటిని తాగినవారు అతిసారా బారిని పడ్డారు. బోర్ల ద్వారా నీటిని సరాపరా చేసిన సమయంలో పైపులైన్లలోకి డ్రైనేజీ నీరు చేరింది.దీంతో బీసీ కాలనీ,ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా కావడంతో ప్రజలు వాంతులు విరోచనాలకు గురయ్యారు.రెండు రోజులు గడిచిన వాంతులు,వీరేశనాలు అదుపులోకి రాకపోవడంతో ఆసుపత్రిలో చేరారు.అతిసారా ప్రవాహం అధికంగా ఉండడంతో 50 మంది బాధితులను నంద్యాల జిజిహెచ్ లో చేర్పించారు. వీరిలో వ్యవసాయ కూలీ రమణ పరిస్థితి విషమంగా ఉండడంతో ఐసియులో చికిత్స అందజేస్తున్నారు. మరో 20 మంది గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్నారు.గ్రామంలో అతి సార ప్రబలిన విషయం తెలియడంతో ట్యాంకర్ ల ద్వారా నీటిని సరఫరా పంచాయతీరాజ్ అధికారులు సరఫరా చేస్తున్నారు. గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి వెంకటరమణ గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ప్రజలు అందరు భయపడవలసిన అవసరం లేదని అన్నారు.

# ఆరోగ్య హక్కు చట్టం అవసరం...



ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశాలను అనుసరించి... ఆరోగ్యానికి సరిపడా బడ్జెట్ కేటాయింపులు చేయాలి. ప్రజలందరికి రక్షిత మంచినీరు, సమతుల ఆహారం అందించాలి. పటిష్ట ఆసుపత్రుల వ్యవస్థ, సరిపడ ఆరోగ్య, వైద్య సిబ్బంది, ఆసుపత్రులలో మౌలిక వసతులను కల్పించాలి. దీనితో పాటు ప్రజలందరికి అందుబాటు ధరల్లో మందుల లభ్యత మొదలగునవన్నీ కల్పించడం ద్వారా రోగులకు ఉపశమనం కల్గించడం ప్రధానంగా ప్రభుత్వ బాధ్యత. కానీ, కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. మందుల ధరలను నియంత్రించే బాధ్యత నుండి అడ్డగోలుగా తప్పుకున్నది. అసలే వైద్య ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ధరల పాలసీ రోగులపై మరింత భారం అవుతుంది. ఇటీవల ఏప్రిల్ 1వ తేదీ నుండి 800 రకాల మందుల ధరలు పెరగడం ఈ విధానంలో భాగమే. మందుల కంపెనీ యజమానులకు అనుకూల విధానాలు చేయడంలో మోడీ ప్రభుత్వం ఏ మాత్రం వెనకాడటం లేదు. ఈ ధరాఘాతం బి.పి, షుగర్ (పట్టిక) మాత్రమేగాక.. అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన మందుల పైనా పడి ప్రజలు భారం మోయలేకున్నారు. ప్రభుత్వ విధానాలే అనుకుంటే%ో%ఇటు మందుల కంపెనీల అనైతిక వ్యాపార విధానాలు బజారులో పెచ్చుమీరుతున్నాయి. వైద్యులను, ఫార్మసీల యజమానులను ప్రలోభపెట్టడం, విపరీతమైన కమీషన్లు-ప్రోత్సాహకాలు ఇవ్వడం, విదేశీ యానాలు, ఖరీదైన బహుమతులు ఇవ్వడం, బల్క్ పర్చేజ్ పేరుతో ఆసుపత్రులు, ఇన్స్టిట్యూషన్ల పర్చేజ్ పేరిట డిపార్టుమెంటు సిబ్బందికి విపరీతమైన లాభాల మార్జిన్లు ఆఫర్ చేయడంతోపాటు, బల్ల కింద లంచాల వరకు అన్ని రకాల అనైతిక చర్యలకు మందుల కంపనీల యాజమాన్యాలు పాల్పడుతున్నాయి. ఈ ఫార్మా కంపెనీల మందుల అమ్మకాల విధానాలపై చట్టపరమైన నియంత్రణ వుండాలని చాలా సంవత్సరాలుగా జన్ స్వాస్థ్య అభియాన్ (జె.ఎస్.ఎ), ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్.ఎమ్.ఆర్.ఎ.ఐ), ఆల్ ఇండియా డ్రగ్ యాక్షన్ కమిటీ (ఎ.ఐ.డి.ఎ.సి) వంటి స్వచ్ఛంద సంస్థలు పోరాడుతున్నాయి. యుసిపిఎంపి ముసాయిదాను చట్టం చేసి, పటిష్టంగా అమలు చేసి, చట్టాన్ని ఉల్లంఘించే యజమానులను శిక్షించాలని పోరాడుతున్నాయి. కానీ కార్పొరేట్ అనుకూల మోడీ ప్రభుత్వం కనీసం యు.సి.పి.ఎం.పి పై పార్లమెంటులో చర్చించకుండా, దాన్ని చట్టంగా కాకుండా కేవలం కంటి తుడుపు చర్యగా స్వచ్ఛందంగానే ఈ కోడ్ని అమలు చేసుకోమని ఫార్మా కంపెనీలకు అప్పచెప్పింది. అంటే ఫార్మా కంపెనీ యజమానుల కమిటీ సభ్యులే మందుల మార్కెటింగ్లో కంపెనీలు ఈ కోడ్ అమలు చేసే రీతిని సమీక్షించి నివేదిక ఇస్తారన్నమాట. పర్యవసానంగా మందుల కంపెనీలు నిర్ద్వంద్వంగా రోగులను లూటీ చేసే పరిస్థితి ఇంకా పెరుగుతున్నది. యుసిపిఎంపి చట్టాన్ని అమలు చేసి రోగులకు ఉపశమనం కల్పించాల్సిన మోడీ ప్రభుత్వం చాలా ఉదాసీనంగా వ్యవహరించడానికి కారణం ఇటీవల ఎన్నికల బాండ్ల ద్వారా మందుల కంపెనీలు బిజెపికి కోట్ల రూపాయల నిధులు ఇవ్వడం. ఈ వ్యవహారం కంపెనీలకు ప్రభుత్వానికి మధ్య జరిగిన క్విడ్ ప్రో కో అని అర్థం చేసుకోవాలి. ఎస్బిఐ ఎలక్టోరల్ బాండ్ల డేటా గమనిస్తే మన దేశంలో కేవలం 9 బడా మందుల కంపెనీల యజమానులే బిజెపికి 400 కోట్ల రూపాయల ఎలక్టోరల్ బాండ్ల ద్వారా చందా ఇచ్చారు. ఇంకా చిన్నా పెద్దా కంపెనీలు కలసి ఎన్ని కోట్ల రూపాయల చందాలు ఇచ్చాయో తెలియాలి. ఇది పెద్ద స్కామ్. ఈ ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చిన కంపెనీల జాబితాలోని ఒక కంపెనీయే చిన్న పిల్లల ప్రాణాలతో చెలగాటమాడే నాసిరకం మందులు తయారు చేసినట్టుగా ఇటీవల చాలా వార్తలు పత్రికల్లో రావడం చూశాం. యుసిపిఎంపి చట్టం అమలు లేకపోవడంవల్లే బాబా రాందేవ్ లాంటి వ్యాపారవేత్తలు బిజెపి ప్రభుత్వ వత్తాసుతో తమ పతంజలి ఉత్పత్తులపై తప్పుడు ప్రకటనలు, తప్పుడు మార్కెటింగ్ విధానాలతో ఇష్టారాజ్యంగా వ్యాపారాన్ని విస్తరించుకోవడం, దానిపై ఇటీవల సుప్రీం కోర్టు పతంజలి కంపెనీపై సీరియస్ అవ్వడం, పతంజలి కంపెనీ బహిరంగ క్షమాపణ చెప్పడం చూశాం. గణాంకాల ప్రకారం మన దేశంలో 47 నుంచి 50 శాతం వైద్య ఖర్చును ప్రజలు తమ జేబుల నుండే పెట్టుకుంటున్నారు. అసలే ఒక పక్క ద్రవ్యోల్బణం పెరుగుతూ ప్రజల ఆదాయాలు తగ్గుతూ, పెరుగుతున్న నిత్యావసర ధరలు, విద్య, ఇతర రోజువారీ ఖర్చులు సగటు మనిషికి పెనుభారం అవుతుంటే ప్రభుత్వం%ో%రోగాల చికిత్సలు, మందులు ఇతర వైద్య ఖర్చులపై విపరీతమై జీఎస్టి పన్ను భారం వేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజారోగ్య వేదిక (పిఎవి), జన్ స్వాస్థ్య అభియాన్ (జెఎస్ఎ) వంటి సంస్థలు ఆరోగ్య హక్కు చట్టంగా తేవాలని అప్పుడే ప్రజలందరికి వైద్య ఖర్చుల భారం నుండి ఉపశమనం కలుగుతుందని ప్రభుత్వాలను డిమాండు చేస్తున్నాయి. 2024 ఎన్నికల నేపథ్యంలో పిఎవి ఆరోగ్య హక్కు చట్టం ముసాయిదాని రూపొందించి అన్ని రాజకీయ పార్టీలకు పంపించింది. అలాగే తమ మ్యానిఫెస్టోలో ఆరోగ్య హక్కు చట్టంపై అన్ని పార్టీలు తమ విధానం తెలియజేయాలని డిమాండు చేసింది. కేవలం వామపక్ష పార్టీలు మినహా ఏ ఇతర రాజకీయ పార్టీలు సానుకూలంగా స్పందించలేదు. పాలక, ప్రతిపక్ష పార్టీలన్నీ హెల్త్ ఇన్సూరెన్సే సంజీవని అని ప్రజల్ని మభ్యపెడుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన మేరకు ప్రతీ ప్రభుత్వం జిడిపిలో 5 శాతాన్ని బడ్జెట్ ప్రజారోగ్యంపై కేటాయించాలి. మన దేశంలో ప్రభుత్వాలు 1.5 శాతం-1.8 శాతం మించి కేటాయింపులు చేయడం లేదు. ఇంత తక్కువ బడ్జెట్లో ప్రైమరీ ఆసుపత్రులను మొదలుకొని టెర్షియరీ కేర్ ఆసుపత్రుల వరకు ఉన్నత ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు కల్పించడం, మందులు/వైద్య పరికరాలు, ఆసుపత్రుల నిర్వహణ, అంబులెన్సుల నిర్వహణ, ఇన్ఫ్రాస్ట్రక్చర్, సరిపడ వైద్య ఆరోగ్య సిబ్బంది నియామకాలు, వారి జీతాలు%ో%ఎలా సాధ్యం? తక్కువ బడ్జెట్ కేటాయింపుల కారణంగానే ప్రైమరీ కేర్ మొత్తం నిర్వీర్యం అయ్యింది. ప్రభుత్వాలు ప్రజారోగ్య పరిరక్షణ బాధ్యత నుండి పూర్తిగా తప్పుకోడానికి ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి హెల్త్ ఇన్సూరెన్సు స్కీములను తీసుకొచ్చాయి. రోగుల భవిష్యత్ అంతా ఆసుపత్రుల యాజమాన్యాలు, ఇన్సూరెన్సు కంపెనీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుంది. ఇన్సూరెన్స్ విధానంలో ఆసుపత్రులు-ఇన్సూరెన్స్ కంపెనీలు కుమ్మక్కై మరింత దోపిడి చేసే అవకాశం ఉంది. కాగ్ నివేదిక ప్రకారం 2022-23లో ఆయుష్మాన్ భారత్ స్కీము అమలులో 13,51,299 కేసులు నకిలీవని తేల్చింది. ఈ నివేదికపై మోడీ ప్రభుత్వం మౌనం వహించింది. కరోనా కాలంలో సంభవించిన లక్షల మరణాలు, ఆసుపత్రులలో ఆక్సిజన్ మొదలుకొని పడకలు, మందులు, వైద్య పరికరాల అందుబాటు, సిబ్బంది కొరత ఇలా ప్రతీ అంశంలో మన ఇన్సూరెన్సు మోడల్ ఆరోగ్య వ్యవస్థలో లోపాలు బయటపడ్డాయి. ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీయాల్సి వచ్చింది. అదే సమయంలో ధనికులకు మాత్రం అన్ని రకాల వైద్య సదుపాయాలు అందాయి. పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొన్నారు. అందుకే మన దేశంలో ఆరోగ్య హక్కు చట్టంతో మాత్రమే ప్రజల ఆర్థిక అసమానతలతో తావు లేకుండా అందరికి సామానంగా వైద్యం అందించడం సాధ్యమవుతుంది. ఆరోగ్య హక్కు చట్టం లేనంతకాలం ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు జవాబుదారీగా ఉండజాలదు.

## ఇండియాలో థర్డ్ జెండర్స్




'ఇంటర్నేషనల్ లెస్బియన్ అండ్ గే అసోసియేషన్ (ఐయల్జిఏ)'తో పాటు 'ఇంటర్నేషనల్ గే అండ్ లెస్బియన్ హూమన్ రైట్స్ కమీషన్' సంయుక్తంగా 17 మే 2005న ప్రారంభించిన 'అంతర్జాతీయ హెూమోఫోబియా వ్యతిరేక దినం' సందర్భంగా ట్రాన్స్జెండర్ (లింగ మార్పిడి) వర్గ పౌరులు ఎదుర్కొంటున్న వివక్ష, చిన్న చూపు, నిరాదరణ, ఎగతాళికి గురి కావడం, పరుష మాటలను ప్రయోగించడం, భౌతిక దాడులు చేయడం, హింసాత్మక పోకడలకు వ్యతిరేకంగా లోతైన అవగాహన కల్పించుట జరుగుతోంది. 17 మే 1990న ఐరాస, డబ్ల్యూహెచ్ఓ నిర్ణయం ప్రకారం హెూమోసెక్సువాలిటీ (స్వలింగ సంపర్కం) అనేది మానసిక రుగ్మత కాదని తీర్మానించడానికి గుర్తుగా 17 మే రోజును ఈ దినం పాటించుట జరుగుతున్నది. ఫ్రాన్స్ లాంటి దేశాలు ఏక-లింగ లైంగిక సంపర్క వ్యక్తుల (సేమ్ సెక్స్) మధ్య వివాహాలను కూడా అనుమతించడం జరిగింది. హెూమోఫోబియా, బయోఫోబియా, ట్రాన్స్ఫోబియా వర్గ ప్రజల సమస్యల్ని అర్థం చేసుకొని, వారి మానవ హక్కులకు విఘాతం కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలనే సందేశాన్ని ఈ వేదిక కల్పిస్తున్నది. లెస్బియన్, గే, బయోసెక్సువల్, ట్రాన్స్జెండర్లు (యల్జిబిటి) స్వతంత్రంగా, స్వేచ్ఛగా జీవించలేక పోతున్నారని, వీరిని నేరస్థులుగా చూసే దేశాలు కూడా ఉన్నాయని తెలుసుకోవాలి. యల్జిబిటి వర్గ ప్రజలు సభ్య సమాజానికి దూరంగా, పలు మానసిక సమస్యలతో సతమతం అవుతూ, అనునిత్యం భయం భయంగా బతుకుతున్నారని, దీనినే హెూమోఫోబియా అంటారని తెలుసుకోవాలి. లెస్బిఫోబియా, గేఫోబియా, బయోఫోబియా, ట్రాన్స్ఫోబియా లాంటివి అన్నీ హెూమోఫోబియా పరిధిలోకి వస్తాయని అర్థం చేసుకోవాలి.

## టీకా సృష్టికర్త ఎడ్వర్డ్ జెన్నర్




వివిధ వ్యాధులు సోకకుండా కాపాడు కోవడానికి, రోగ నివారణ కోసం వ్యాక్సిన్లు తీసుకోవడం సర్వ సాధారణ మై పోయింది. కుక్కకాటు, క్షయ, కలరా, కామెర్లు, మలేరియా, కేన్సర్ల వంటి వ్యాధులకు పూర్వం సరైన మందులు లేవు. ప్రధానంగా మానవాళి మనుగడకు పెను సవాలుగా నిలిచిన మశూచి వ్యాధి ప్రపంచ మంతా భయంకరంగా వ్యాపించి ఉండేది. ఇంగ్లండ్కు చెందిన ఎడ్వర్డ్ జెన్నర్ మహనీయుడు స్మాల్ఫాక్స్ వ్యాధి సోకకుండా ఉండటానికి వ్యాధి నిరోధక 'వాక్సినేషన్' మందు కనిపెట్టి మానవాళికి ఎంతో మేలు చేశాడు. వ్యాక్సిన్ అనే పదం 'వాకా' నుంచి వచ్చింది. వాకా అంటే ఆవు అని అర్థం. స్మాల్పాక్స్ (మశూచి) క్రీ.పూ 3వ శతాబ్దం నుంచి మానవ చరిత్రలో ఈ వ్యాధి ప్రస్తావన కనిపిస్తుంది. 18వ శతాబ్ది నాటికి కాలనైజేషన్ కారణంగా ప్రపంచమంతా విస్తరించింది. దీనివల్ల కలిగే మరణాలు భారీగా ఉండేవి. మశూచి అంటువ్యాధి. అయితే, దీనికి వ్యాక్సిన్ కనిపెట్టింది మాత్రం 1796వ సంవత్సరంలోనే బ్రిటన్ కు చెందిన డాక్టర్ ఎడ్వర్డ్ జెన్నర్ మశూచికి వ్యాక్సిన్ కనిపెట్టారు. ఒక వ్యాధికి అడ్డుకట్ట వేయడానికి తయారు చేసిన తొలి వ్యాక్సిన్ ఇదే. దీని వల్లే మశూచి మరణాల సంఖ్య గణనీయంగా తగ్గాయి. ప్రపంచ వ్యాప్తంగా ఈ వ్యాక్సిన్ అందుబాటు లోకి రావడంతో 1980 నాటికి మశూచి అంతమైనట్లు అప్పటి వరల్డ్ హెల్త్ అసెంబ్లీ ప్రకటించింది. జెన్నర్ ఒక ఆంగ్ల వైద్యుడు, మశూచి వ్యాక్సినేషన్ మార్గదర్శకుడు, రోగనిరోధక శాస్త్ర పితామహుడు.ఎడ్వర్డ్ జెన్నర్ 1749 మే 17న గ్లౌసెస్టర్షైర్ లోని బర్కిలీలో జన్మించాడు. 14 సంవత్సరాల వయస్సులో, స్థానిక సర్జన్ వద్ద, తరువాత లండన్లో శిక్షణ పొందాడు. 1772లో, అతను బర్కిలీకి తిరిగి వచ్చాడు. అతని కెరీర్లో ఎక్కువ భాగం తన స్థానిక పట్టణంలో వైద్యుడిగా గడిపాడు.1796లో, అతను ఎనిమిదేళ్ల జేమ్స్ ఫిప్స్పై ఇప్పుడు ప్రసిద్ధి చెందిన ప్రయోగాన్ని చేశాడు.


# ఆకస్‌ను ఆపండి..! అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియాలను కోరిన చైనా

బీజింగ్ : అకస్ అణు జలాంతర్గామి ఒప్పందాన్ని నిలిపివేయాలని అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియాలను చైనా కోరింది. అంతర్జాతీయ సమాజం దీనిపై ఒక స్పష్టమైన నిర్ధారణకు వచ్చేవరకు ఈ ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లకుండా ఆపాలని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ కోరారు. ఇందుకోసం అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ), అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం(ఎన్‌పిటి) వంటి వేదికలను చైనా ఉపయోగించుకుంటుందని, ఈ ఒప్పందానికి సంబంధించిన రాజకీయ, చట్టపరమైన, సాంకేతిక అంశాలను కూలంకషంగా చర్చిస్తుందని చెప్పారు. ఇటీవల వియన్నాలో చైనా రాయబార కార్యాలయం నిర్వహించిన అకస్‌పై అధ్యయనానికి సంబంధించిన వర్క్‌షాప్ గురించి వ్యాఖ్యానించమని కోరగా వెన్‌బిన్ పై విధంగా స్పందించారు. ఈ నెల 10న దీనిపై సెమినార్ జరిగింది. దాదాపు 50దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఐఎఇఎ కార్యదర్శివర్గం, చైనా, ఇతర దేశాలకు చెందిన మేధావులు, నిపుణులు హాజరయ్యారు. వందమందికి పైగా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో అకస్ భద్రతపై, పర్యవేక్షణ గురించి చర్చల్లో పాల్గొన్నారని, ఇది చూస్తేనే ఈ అంశంపై అంతర్జాతీయ సమాజానికి గల ఆందోళన, దృష్టి తెలుస్తోందని వెన్‌బిన్ పేర్కొన్నారు. అకస్ అణు జలాంతర్గామి ఒప్పందం ప్రాంతీయ శాంతి, భద్రతలను కొనసాగించాలనే ప్రయత్నాలను దెబ్బతీస్తుందని వెన్‌బిన్ చెప్పారు.

అణు జలాంతర్గాములపై సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళేందుకు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియాలు త్రైపాక్షిక భద్రతా భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. దీనివల్ల ఆయుధ పోటీ పెరుగుతుందని, అంతర్జాతీయ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందాన్ని దెబ్బతీస్తుందని చైనా పేర్కొంటోంది.



## స్లొవేకియా ప్రధానిపై కాల్పులు



బ్రటిస్లా : గని తవ్వకాలు ఎక్కువగా జరిగే హండ్‌లోవా నగరంలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండగా బుధవారం స్లొవేకియా ప్రధాని రాబర్ట్ ఫికో (స్మెర్)పై కాల్పులు జరిగాయని డెన్నిక్ ఎన్ డైలీ న్యూస్ వెల్లడించింది. సమావేశాలు జరుగుతున్న కల్చరల్ హౌస్ వెలుపల ప్రధానిపై ఒక వ్యక్తి కాల్పులు జరిపాడు. ఆ భవనం వెలుపల ప్రధాని తన మద్దతుదారులతో మాట్లాడుతుంటే ఈ సంఘటన జరిగింది. పలుసార్లు తుపాకీ మోతలు వినిపించాయని పేర్కొంది. వెంటనే ఫికో నేలపై పడిపోయారని, దాంతో అధికారులు సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్ళారని తెలిపింది. కాల్పులు జరిపిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఈ కాల్పుల కారణంగా బ్రటిస్లావాలో పార్లమెంట్ డిప్యూటీ స్పీకర్ లూబోస్ బాల్వా పార్లమెంట్ సమావేశాన్ని రద్దు చేశారు. ఈ కాల్పులకు ప్రతిపక్షమే కారణమని బాల్వా విమర్శించారు. "ఇది మీ తప్పే' అని ఆయన ప్రతిపక్షంతో అన్నారు. పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ బిల్లుపై బుధవారం ఎంపీలు చర్చిస్తున్నారు. అధ్యక్షుడు జుజనా కపుటొవియా ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. నాలుగుసార్లు ప్రధానిగా చేసిన ఫికోపై దారుణంగా దాడి జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఈ ఘటనతో తాను తీవ్రంగా దిగ్భ్రాంతి చెందానని వ్యాఖ్యానించారు.

## బిజెపికి బాంయ్ కాట్ భయం.....!



**చండీగఢ్ :** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పంజాబ్, హర్యానాల్లో రైతుల నుంచి బిజెపికి మరో ఎదురుదెబ్బ తగిలేలా కనిపిస్తున్నది. ఈ సారి ఎన్నికల్లో గ్రామీణ ప్రాంత ఓటు ఆ పార్టీకి మరోసారి వచ్చే అవకాశాలు కనిపించటం లేదనీ, ఇది కాషాయదళానికి రాజకీయంగా తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కనీసం మద్దతు ధర(ఎంఎస్‌పి) కోసం చట్టపరమైన హామీని కోరుతూ ఈ రెండు రాష్ట్రాల రైతులు ఇప్పటికే పోరాటాలు చేశారు. కానీ, మోడీ సర్కారు నుంచి ఇప్పటికీ ఎలాంటి సానుకూల నిర్ణయమూ రాకపోవటం రైతుల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. లోక్‌సభ ఎన్నికలు జరగనున్న ఈ రెండు రాష్ట్రాల్లో దాని పర్యవసానాలను బిజెపి నాయకులు ఇప్పటికీ అనుభవిస్తున్నారు. జూన్ 1న ఎన్నికలు జరగనున్న పంజాబ్‌లోని గ్రామాల్లోకి పార్టీ అభ్యర్థులను రాకుండా ఆగ్రహించిన రైతులు అడ్డుకుంటున్నారు. పొరుగున ఉన్న హర్యానాలోని గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. ముఖ్యంగా పంజాబ్‌లోని మాల్వా, మఝూ బెల్ట్‌లలో గ్రామాల్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన తమ పార్టీ నాయకులకు నల్లజెండాలు చూపారని రాష్ట్ర బిజెపి చీఫ్ సునీల్ జాఖర్ మే 6న ప్రధాన ఎన్నికల అధికారి సి. సిబిన్‌కు ఫిర్యాదు చేశారు. భగవంత్ మాన్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వం ప్రచారం చేసే హక్కును కల్పించటంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. హర్యానాలో గత వారం, కోపోద్రిక్తులైన రైతులు బిజెపి సోనిపట్ అభ్యర్థి మోహన్ లాల్ బడోలీ ర్యాలీని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. లోక్‌సభ ఎన్నికలు జరగనున్న ఈ రెండు రాష్ట్రాల్లో దాని పర్యవసానాలను బిజెపి నాయకులు ఇప్పటికీ అనుభవిస్తున్నారు. జూన్ 1న ఎన్నికలు జరగనున్న పంజాబ్‌లోని గ్రామాల్లోకి పార్టీ అభ్యర్థులను రాకుండా ఆగ్రహించిన రైతులు అడ్డుకుంటున్నారు.

# ప్రబీర్ అరెస్టు చెల్లదు తక్షణమే విడుదల జేయండి.....!



**న్యూఢిల్లీ :** న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు, జర్నలిస్టు, రచయిత ప్రబీర్ పుర్కాయస్థ అరెస్టు చెల్లదని, ఆయనను బెయిలుపై తక్షణమే విడుదలజేయాలని సుప్రీం కోర్టు బుధవారం చారిత్రాత్మక తీర్పునిచ్చింది.కోర్టు తీర్పు నేపథ్యంలో బుధవారం రాత్రి 9.30 గంటలకు ప్రబీర్ పుర్కాయస్త జైలు నుంచి విడుదలయ్యారు.ప్రశ్నించేవారిపై దేశ ద్రోహ నేరం వంటి తప్పుడు కేసులు బనాయించి స్వతంత్ర మీడియా పీకనులిమేస్తున్న నిరంకుశ మోడీ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటి తీర్పు ఇది. 2023 ఆగస్టులో 'న్యూయార్క్ టైమ్స్' ప్రచురించిన ఓ కట్టు కథ ఆధారంగా అదే సంవత్సరం అక్టోబరు3న ఢిల్లీ పోలీసులు ఆయనను అరెస్టు చేశారు.

భారత దేశాన్ని దెబ్బ తీసేందుకు విదేశీ శక్తులతో కుమ్మక్కయ్యారని ప్రబీర్‌పైన, న్యూస్‌క్లిక్‌పైన వారు అభియోగాలు మోపారు. న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడి అరెస్టు విషయంలో ఢిల్లీ పోలీసులు కనీస ప్రాథమిక నియమాలు కూడా పాటించకుండా ఎందుకంత తొందరపాటుతో వ్యవహరించారని జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. ఇది సహజ న్యాయసూత్రాలను, కోర్టు మునుపటి ఆదేశాలను పూర్తిగా ఉల్లంఘించడమేనని పేర్కొంది. 2023 అక్టోబరు4వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రబీర్‌పై రిమాండ్ ఆర్డర్ జారీ చేసిన కొన్ని గంటల తరువాత ప్రబీర్ లాయర్‌కు రిమాండ్ దరఖాస్తు ప్రతిని ఇచ్చారని కోర్టు పేర్కొంది. అక్టోబరు3న వందలాది మంది అధికారులు న్యూఢిల్లీలోని దాదాపు 100 ప్రదేశాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించారు. అసాధారణమైన రీతిలో మూకుమ్మడి దాడులు నిర్వహించి, డజన్ల కొద్దీ వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పెద్ద సంఖ్యలో ఎలక్ట్రానిక్ పరికరాలను ఇతర వస్తువులను తీసుకెళ్లారు. న్యూస్‌క్లిక్‌లో ప్రస్తుతం, గతంలో పనిచేసిన ఉద్యోగులను గంటల తరబడి విచారించారు. ప్రబీర్ అరెస్టు చట్ట విరుద్ధమని తీర్పు ఇచ్చిన కోర్టు ఆయనను బెయిలుపై విడుదల చేయాలని ఆదేశించింది. ల" మేము ఆయనను ష్యూరిటీ లేకుండా విడుదల చేయవచ్చు. కానీ, చార్జిషీట్ దాఖలైనందున ష్యూరిటీ, బెయిలు బాండ్‌తో విడుదల జేస్తున్నాం అని కోర్టు పేర్కొంది. ఈ కేసులో విచారణను ఏప్రిల్30తో ముగించిన సుప్రీం కోర్టు తన తీర్పును రిజర్వులో ఉంచి బుధవారం ప్రకటించింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ట్రయల్ కోర్టు కొన్ని షరతులతో బెయిలు మంజూరు చేసింది. అనేక అరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రబీర్ ఏడు నెలలుగా అకారణంగా జైలులో మగ్గారు. ఆయన కస్టడీని పదే పదే పొడిగింపును కోరిన ఢిల్లీ పోలీసులు చివరకు క్రూరమైన ఉగ్రవాద వ్యతిరేక చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద అభియోగాలు మోపుతూ 8,000 పేజీల చార్జిషీట్‌ను దాఖలు చేశారు. న్యూస్ క్లిక్ ఈ ఛార్జిషీట్‌ను నిరాధారమైనది, కుట్రపూరితమైనదని తోసిపుచ్చింది. ప్రబీర్ అరెస్టును భారత దేశంలోను, ప్రపంచ వ్యాపితంగా ఉన్న ప్రగతి శీల శక్తులు ఖండించాయి. బిజెపి నేతృత్వంలోని మితవాద ప్రభుత్వం మీడియా స్వేచ్ఛపై దాడిగా పేర్కొంటూ ప్రబీర్‌ను వెంటనే విడుదలజేయాలని డిమాండ్ చేశాయి.

## భారత్ చంద్రుడిపై కాలుమోపింది.. మనమేమో...



ఇస్లామాబాద్: పాకిస్థాన్ దయనీయ పరిస్థితిని వివరిస్తూ ఆ దేశ చట్టసభ సభ్యుడు సయ్యద్ ముస్తఫా కమల్.. భారత్ సాధిస్తున్న పురోగతిని ప్రస్తావించారు. భారత్ చంద్రుడిపై కాలుమోపుతుంటే.. పాక్ మాత్రం ఇంకా మురుగు కాలువల్లో పిల్లల మరణాలనూ నివారించలేకపోతోందంటూ పార్లమెంటు సాక్షిగా వారి దయనీయ స్థితిపై వాపోయారు. ఆయన ప్రసంగం ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. "టీవీలో చంద్రుడిపై భారత్ కాలుమోపినట్లు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత రెండు సెకన్లలోనే అదే తెరపై కరాచీలో పిల్లలు మురుగు కాలువల్లో పడి మరణించిన సమాచారం వచ్చింది.

## 84 ఏళ్ల తర్వాత స్విట్జర్లాండ్‌లో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవం




జ్యూరిచ్ : 84 ఏళ్ల తర్వాత స్విట్జర్లాండ్‌లో మళ్లీ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది. రివల్యూషనరీ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ స్విట్జర్లాండ్ (ఆర్‌కెపి) పేరుతో బెర్న్‌లోని బర్గ్‌డోర్ఫ్‌లో జరిగిన 342 మంది ప్రతినిధుల సమావేశంలో స్థాపించ బడింది. డెర్సు హేరి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. సామ్రాజ్యవాద యుద్ధం, ద్రవ్యోల్బణం, వాతావరణ సంక్షోభం, పాలస్తీనా సమస్య ఈ సదస్సులో ప్రధాన అంశాలుగా ఉన్నాయి. స్విస్ యూనివర్సిటీల్లో జరుగుతున్న పాలస్తీనా అనుకూల నిరసనలకు పూర్తి మద్దతు ఇవ్వాలని, నిరసనలను మరింత ఉధృతం చేయాలని ఆర్‌కెపి నిర్ణయించింది. పాలస్తీనాకు అనుకూలంగా ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఉద్యమాలకు మద్దతుగా నిలిచే లక్ష్యంతో పార్టీ తదుపరి సదస్సు జూన్ 10 నుంచి 15 వరకు జరగనుంది.

## కుటుంబ వ్యవస్థను పటిష్టం చేద్దాం!


ఒక కుటుంబంలో తాత, అమ్మ మొదలు వారి పిల్లలు, వారి పిల్లలు ఇలా మూడు నుంచి నాలుగు తరాలు ఉమ్మడి కుటుంబంలో ఉండేవి. ఇంటిలోని పెద్దకు అందరూ గౌరవం ఇస్తూ, ఆయన మాటే వినేవారు. ఆ కుటుంబాలలో పెద్దల సంరక్షణలో పిల్లలు ఆనందంగా ఉండేవారు. కష్టసుఖాలు సమానంగా పంచుకునే ఆత్మీయులు, ఆపదలో ఆదుకునే బంధుమిత్రులతో ఒంటరితనం అనే భావన లేకుండా ఆనందంగా గడిపిన కుటుంబాలెన్నో ఉన్నాయి. కానీ నేడు చూస్తే ఉమ్మడి కుటుంబాలుగా ఉన్న ఎన్నో కుటుంబాలు ఆధునిక ప్రపంచంలో చిన్న కుటుంబాలుగా మారాయి. ఆధునికత పెరగడం, నాగరికత పురోభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి కలసి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ను దెబ్బ తీసింది. అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం ప్రతి సంవత్సరం మే 15న విశ్వవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. సాంకేతిక రంగంలో అభివృద్ధి చెందుతున్నప్పటికీ సమాజంలో కుటుంబ వ్యవస్థ బలహీనపడుతున్న విషయాన్ని గుర్తించి, కుటుంబ విలువలను తెలియజేయడం కోసం, ఉమ్మడి కుటుంబాల అవసరం గురించి వివరించడం కోసం ఈ రోజును ప్రత్యేకంగా కేటాయించారు. పూర్వకాలంలో మాదిరిగా ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు ఉండడం లేదు. ఒంటరితనం పెరిగిపోయి వ్యసనాలకు బానిసలు కావ డం, పట్టించుకునేవారు లేకపోవడంతో విచ్చల విడిగా బతకడం, పిల్లలకు సంస్కృతి సాంప్రదాయం తెలియజేసే తాతలు, అమ్మలు లేకపోవడం, క్షణికావేశంలో నేరస్థులుకావడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. కుటుంబ వ్యవస్థ బలహీనమవ్వడం మూలంగా సమాజంలో జరిగే నష్టాలను, తీవ్ర పరిణామాలను గ్రహించిన ఐక్యరాజ్య సమితి కుటుంబ వ్యవస్థను పటిష్టం చేయడం కోసం 1993, మే 15న అంతర్జాతీయ కుంటుంబ దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించింది. కుటుంబ వ్యవస్థను కాపాడుకోవడం అనే అంశాన్ని వివరిస్తూ ప్రజా చైతన్యంకోసం ప్రపంచ వ్యాప్తంగా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి కుటుంబ వ్యవస్థ ప్రాధాన్యతను వివరించడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తుంది. విచ్ఛిన్నమవుతున్న కుటుంబాల మధ్య తిరిగి ప్రేమానురాగాలు పెంపొందించాలనే ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని జరుపుకోవడానికి నిర్ణయించింది. కుటుంబ సమైక్యత గురించి ప్రజలందరికీ అవగాహన కలిగించడం, కుటుంబ పెద్దల నైపుణ్యాన్నీ, అనుభవాలను పంచుకుంటూ కుటుంబ సమస్యల విషయంలో సరైన సహకారాన్ని అందించడం, కుటుంబాలలో నెలకొన్న విభేదాలను తొలగించి ఆయా కుటుంబాలలో సుఖశాంతులు నెలకొల్పడం వంటి లక్ష్యాలతో ఈ రోజును జరుపుకుంటున్నాము. కుటుంబ వ్యవస్థ మన సమాజం మనకు ఇచ్చిన ఒక గొప్ప అరుదైన కానుకగా భావించవచ్చు. కుటుంబం అనేది సమాజంలో ఒక ముఖ్యమైన భాగం. ఈ ప్రత్యేకత కారణంగా కుటుంబం వ్యక్తిని జాతికి అనుసంధానం చేస్తూ వసుధైక కుటంబం అనే దిశలో ప్రయాణానికి తోడ్పడుతున్నది. సామాజిక, ఆర్థిక భద్రతకు ఒక సంపూర్ణ వ్యవస్థ కావడంతో పాటు, కొత్త తరానికి సంస్కారాలు, విలువలు నేర్చే ముఖ్యమైన మాధ్యమంగా కూడా కుటుంబం వ్యవహరిస్తుంది. కుటుంబ వ్యవస్థ వల్ల సమాజానికి మనం ఇచ్చే సందేశం ఎంతో గొప్పది. ప్రపంచ దేశాల్లో భారత దేశ కుటుంబ వ్యవస్థలా మరెక్కడా లేకపోవడం అనేది మన ధర్మం గొప్పతనంగా భావించవచ్చు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు, నాగరికత అభివృద్ధికి మూలమైనది ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. పూర్వకాలం నుండి మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉందని చరిత్ర ద్వారా మనకు తెలిసిందే. మన దేశంలో ఉమ్మడి కుటుంబాల వారు ఆనందంగా ఉన్నారని మన చరిత్ర ద్వారా మనం తెలుసుకున్న నిజం. ఒక కుటుంబంలో తాత, అమ్మ మొదలు వారి పిల్లలు, వారి పిల్లలు ఇలా మూడు నుంచి నాలుగు తరాలు ఉమ్మడి కుటుంబంలో ఉండేవి. ఇంటిలోని పెద్దకు అందరూ గౌరవం ఇస్తూ, ఆయన మాటే వినేవారు. ఆ కుటుంబాలలో పెద్దల సంరక్షణలో పిల్లలు ఆనందంగా ఉండేవారు. కష్టసుఖాలు సమానంగా పంచుకునే ఆత్మీయులు, ఆపదలో ఆదుకునే బంధుమిత్రులతో ఒంటరితనం అనే భావన లేకుండా ఆనందంగా గడిపిన కుటుంబాలెన్నో ఉన్నాయి. కానీ నేడు చూస్తే ఉమ్మడి కుటుంబాలుగా ఉన్న ఎన్నో కుటుంబాలు ఆధునిక ప్రపంచంలో చిన్న కుటుంబాలుగా మారాయి. ఆధునికత పెరగడం, నాగరికత పురోభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి కలసి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ను దెబ్బ తీసింది. నేటి ఆధునిక ప్రపంచంలో రెండు కుటుంబాలు కాదు కదా రెండు మనసులు కూడా కలసి జీవించలేని పరిస్థితి నెలకొంది. డబ్బు సంపాదన కోసం కనీసం భార్యభర్తలు కూడా ఒక చోట కూర్చుని ఒకరినొకరు పలకరించుకునే సమయం లేదంటే మన కుటుంబ వ్యవస్థ ఎంత బలహీన పడిందో అర్థం చేసుకోవచ్చు. అందరూ డబ్బు సంపాదించే యంత్రాలుగా మారి, తల్లి దండ్రులను చూసుకొనే తీరికలేక వృద్ధాశ్రమాలలో వేస్తున్నారు. ఉమ్మడి కుటుంబాలలో కలిసిమెలిసి ఉండే మనసులు కానీ, మనుషులు కాని లేక, పెళ్లయిన వెంటనే వేరు కాపురాలు పెట్టుకుని జంటలుగా ఉండి కూడా మొబైల్ ఫోన్ చేతిలో పట్టుకొని ఒంటరై పోతున్నారు. సలహాలు సూచనలు ఇచ్చే పెద్దవారు లేక, ఆపదలో ఆదుకునే ఆత్మీయులు రాక, కనీసం మనసులోని బాధలను పంచుకునే బంధువులు ఉండక, జీవితమంటే విసుగు వచ్చే స్థాయికి నేటి యువత వెళ్లిందంటే కారణాలను గుర్తించాల్సిన అవసరం ఉంది. కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కాకుండా కాపాడుకుంటూ, ఉమ్మడి కుటుంబాల ప్రాధాన్యతను గుర్తించవలసిన అవసరం ఎంతైనా ఉంది. కుటుంబ వ్యవస్థ ముఖ్యోద్దేశాలు పిల్లలకు సమాజంలో ఒక స్థానాన్ని కల్పించడం, సంస్కృతిని వారికి అందజేయడం, ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడంగా ఉండాలి.

# ఆత్మహత్యలను ప్రేరేపిస్తున్న గంజాయి....




ప్రజెంట్ యువత గంజాయి మత్తుకి గమ్మత్తుగా బానిసవుతోంది. ఈ గంజాయి మత్తులో చిత్తవుతూ దారి తప్పుతోంది. గంజాయి తీసుకున్న యువత మత్తులో సామాన్య ప్రజానీకం పై దాడులు దారి దోపిడీలకు పాల్పడుతున్నారు. మత్తులో తమ జీవితాలను నాశనం చేసుకునేది కాకుండా సామాన్య ప్రజల ప్రశాంత జీవితానికి ఆటంకం కలిగిస్తున్నారు. గంజాయి మత్తులో ఊగిపోతూ మత్తులో తాము ఏమి చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితుల్లో ఉన్నారు. అసలు విషయం ఏంటంటే గంజాయి మత్తులో యువత తమ ప్రాణాలను సైతం కోల్పోతున్నారు. చిన్న చిన్న సమస్యలకై ఒత్తిడికి గురై మత్తులో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తాజా అధ్యయానాలు చెబుతున్నాయి. యువత మత్తు పదార్థాలకు ఆకర్షితులై బానిసలుగా మారుతున్నారు. తెలిసి చేసిన తెలియక చేసిన అనారోగ్యం బారిన పడి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తాజా అధ్యయనంలో తేలింది. దీన్ని ఎక్కువ మోతాదులో తీసుకుంటే ప్రాణాంతక సమస్యలు కూడా కలుగుతాయని తెలిపారు. ఈ విషయాన్ని పక్కన పెట్టి విచ్చలవిడిగా గంజాయి వినియోగిస్తున్న వారికి తాజా అధ్యయనం షాక్ ఇచ్చింది. స్కిజోఆఫెక్టివ్ డిజార్డర్?తో 27 ఏళ్ల మహిళ దీర్ఘకాలిక నొప్పితో కూడిన నాడీ సంబంధిత సమస్యతో ఇబ్బంది పడుతుంది. ఈ సమస్య పై పరిశోధకులు అధ్యయనం చేశారు. అయితే ఈ మహిళ ఈ నొప్పిని భరించలేక గంజాయి తీసుకొనేదంట. ఈ డోస్ రోజు రోజుకి పెరిగిపోవడంతో పరిస్థితి విషమించింది. మెంటల్?గా డిస్టర్బ్ తీవ్ర అలసట, నిద్ర సమస్యలు, ఆత్మహత్య ఆలోచనలు, తీవ్రమైన మానసిక ఇబ్బందులతో ఆమె ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. ఆమెను పరిశీలించిన వైద్యులు ఆమెతో గంజాయి వాడకాన్ని మానిపించారు. అప్పుడు ఆమెలోని మానసిక స్థితి కొద్ది కొద్దిగా మెరుగవడం గమనించారు. ఒక వేళ ఆమె అదే విధంగా గంజాయిని వినియోగిస్తే అది ఆమె ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడేదని వైద్యులు తెలిపారు. ఈ గంజాయి వల్ల భయభ్రాంతులు కలగడం, ఆందోళన కలుగుతాయని అధ్యయనంలో తేలింది. ఎక్కువ మోతాదులో గంజాయి తీసుకుంటే సైకోసిస్ అనే మానసిక అనారోగ్యానికి గురి చేస్తుందని మానసిక వైద్యులు చెబుతున్నారు.

# వాపింగ్ ఆరోగ్యానికి హాని కలిగిస్తుందా?




ఈ మధ్యకాలంలో సిగరెట్ కంటే ఈ-సిగరెట్, వ్యాపింగ్ పట్ల యువతలో ఆసక్తి పెరిగింది. చాలా మంది ప్రజలు సిగరెట్‌లకు మంచి ప్రత్యామ్నాయంగా భావిస్తున్నారు. ధూమపానం కంటే ఇది తక్కువ హానిని కలిగిస్తుందని వారు అంటున్నారు. ఇది ధూమపానం కంటే తక్కువ హానిని కలిగిస్తుంది అనేది చాలా వరకు నిజం అయినప్పటికీ, ఇది చాలా తీవ్రమైన నష్టాలను కూడా కలిగి ఉంది. వాస్తవానికి అనేక రసాయనాలను వాపింగ్‌లో ఉపయోగిస్తారు. వాటిని వేడి చేసినప్పుడు అవి చాలా విషపూరితంగా మారి ఆరోగ్యం మీద ప్రభావం చూపిస్తాయి. ఈ వేప్‌లను వేడి చేసినప్పుడు, విషపూరిత రసాయనాలు వేగంగా లీక్ అవుతాయని, ఇది ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరమని ఒక పరిశోధన వెల్లడించింది. ఈ పరిశోధనలో, 180 వేప్ రుచులు చేర్చారు. వీటిని వాపింగ్ కోసం ఉపయోగిస్తారు. వాపింగ్‌లో ద్రవ రుచిని అధిక ఉష్ణోగ్రతల వద్ద వేడి చేసినప్పుడు, పీల్చే ఏరోసోల్ ఏర్పడుతుంది. ఇందులో చాలా రకాల రసాయనాలు వాడతారు. వీటిలో గ్లిజరిన్, ప్రొపైలిన్ గ్లైకాల్, నికోటిన్, ఫ్లేవర్డ్ రసాయనాలు ఉన్నాయి. ఈ రుచులే కాకుండా, స్ట్రాబెర్రీ, పుచ్చకాయ, బ్లూబెర్రీ వంటి అనేక పండ్ల రుచిగల వేప్‌లు కూడా బాగా ప్రాచుర్యం పొందాయి. కానీ వేడిచేసినప్పుడు ఇది ఆరోగ్యానికి గొప్ప హాని కలిగించే ప్రమాదకరమైన రసాయనాలను ఉత్పత్తి చేస్తుంది. దీని కారణంగా దీర్ఘకాలిక అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్, గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. సాధారణ సిగరెట్లతో పోలిస్తే ఈ-సిగరెట్‌లలో అనేక రసాయనాలు వాడుతున్నారని, వాటి నుంచి ఆవిరి బయటకు వస్తుందని, అయితే ఈ-సిగరెట్‌లలో కూడా రసాయనాలు ఉన్నాయని, ఇవి అనేక హానిని కలిగిస్తాయని సీనియర్ కార్డియాలజిస్ట్ చెబుతున్నారు. నేటి యువత చల్లగా కనిపించాలని హాబీగా ఈ-సిగరెట్ తాగుతున్నారు. కానీ క్రమంగా దానికి అలవాటు పడ్డారు. దీని వల్ల ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. రసాయనాలు, దాని నిరంతర ఉపయోగం కారణంగా, ఒక వ్యక్తి ధూమపానం నుంచి తనను తాను ఆపుకోలేకపోవటం వలన సాధారణ ధూమపానానికి అలవాటు పడతాడు. ఇ-సిగరెట్ నుండి సాధారణ సిగరెట్‌కి మారడం వారికి సులభం అవుతుంది.

# బాడీని కూల్ చేసే మ్యాంగో లస్సీ.....!




వేసవి కాలంలో శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి, ప్రజలు అనేక పానియాలను తాగుతుంటారు. ఇందులో నిమ్మరసం, లస్సీ చాలా సాధారణం. వేసవిలో దీన్ని తాగడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని భావిస్తారు. ఇది శరీరానికి చల్లదనాన్ని అందిస్తుంది. అయితే మీకు ప్రతిసారీ సింపుల్ లస్సీని తాగాలని అనిపించకపోతే, మీరు మ్యాంగో లస్సీని ప్రయత్నించవచ్చు. ముఖ్యంగా మామిడి పండ్లను ఇష్టపడేవారు. అయితే చాలా మంది మామిడిపండు లస్సీ తాగేందుకు మార్కెట్‌కి వెళ్తుంటారు. అయితే దీన్ని ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు. మీ పిల్లలు లస్సీ తాగకపోతే మామిడిపండు తినడానికి ఇష్టపడతారు. కాబట్టి మీరు మ్యాంగో లస్సీని తయారు చేసి వారికి ఇవ్వవచ్చు. ఇది చాలా రుచిగా ఉంటుంది. దీన్ని తయారు చేయడానికి మీకు మామిడి, పెరుగు, చక్కెర, యాలకుల పొడి, పుదీనా ఆకులు అవసరం. ఈ లస్సీ చేయడానికి మామిడికాయ ముక్కలు, చక్కెర, యాలకులు వేసి, పెరుగు, పాలు అన్నీ వేసి మిక్సీ పట్టండి. తరువాత ఐస్ క్యూబ్స్ వేసుకుంటే 5 నిమిషాల్లో మ్యాంగో లస్సీ రెడీ. ఇప్పుడు దానిని గ్లాసులో వేసుకుని కూల్ కూల్ గా తాగేయొచ్చు. పాల ఉత్పత్తులను మామిడిపండులో ఉపయోగించవచ్చు. దీంతో విటమిన్లు, అనేక ఇతర పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ఇది మంచి బ్యాక్టీరియాను కలిగి ఉంటుంది. కానీ మీరు ప్రతిరోజూ మామిడికాయ లస్సీని తాగితే, దాని వల్ల కడుపు సంబంధిత సమస్యలు, అనేక ఇతర ఆరోగ్య సంబంధిత సమస్యలు వస్తాయని గుర్తుంచుకోండి.

# చద్ది చపాతీలు తింటున్నారా.....?



చాలా మంది రాత్రి మిగిలిన ఆహారాన్ని ఉదయం తినడానికి ఇష్టపడరు. కానీ కొందరు మాత్రం కచ్చితంగా తింటారు. మరికొందరు వేస్ట్ చేయడం ఇష్టం లేదని తింటారు. మరి చపాతీలను తింటారా? అవి గట్టిగా అవుతాయి అని.. లేదంటే చద్దివి అని కొందరు తినరు. అయితే, చాలా మంది ఇలా మిగిలిపోయిన చపాతీలు తినేందుకు భయపడుతుంటారు. వీటిని తినడం వల్ల అనారోగ్య సమస్య తలెత్తే ప్రమాదం ఉంటుందని ఆందోళన చెందుతుంటారు. ఇంతకీ మిగిలిన చపాతీలను మర్నాడు తినడం వల్ల ఏం జరుగుతుందో తెలుసుకోవాలి అని ఉందా? తెలుసుకున్న తర్వాత ఒక్క చపాతీని కూడా పడేయడానికి ఇష్టపడరు. ఓ సారి చూసేయండి. ప్రతి ఒక్కరూ అప్పుడే పాన్ మీద నుంచి తీసిన వేడి వేడి రోటీని తినడానికి ఇష్టపడతారు. కానీ రాత్రి మిగిలిపోయిన పాత రోటీ విషయానికి వస్తే, చాలా మంది ఆకలిని చంపేసుకుంటుంటారు. కానీ, రాత్రి మిగిలిన చపాతీ రోగనిరోధక శక్తిని పెంచడానికి ఉపయోగపడుతుంది అంటున్నారు నిపుణులు. అందుకని రాత్రి మిగిలిపోయిన రోటీని మళ్లీ నూనె పోసి వేడిచేయటం కాకుండా అలాగే తినాలని చెబుతున్నారు. మిగిలిపోయిన రోటీ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. జీర్ణ సమస్యల నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. మీకు మలబద్ధకం సమస్య ఉంటే, ఇలా రాత్రి మిగిలిపోయిన చపాతీ తింటే మంచిది. ఉదయాన్నే రాత్రి మిగిలిన చపాతీలను తినడం వల్ల కడుపు ఉబ్బరం, ఎసిడిటీ వంటి సమస్యల నుంచి కూడా బయటపడవచ్చు. బరువు తగ్గడానికి కూడా ఉపయోగపడుతుంది. ఇలాంటి చపాతీలు తినడం వల్ల మీ బరువు కూడా నియంత్రణలో ఉంటుంది. తాజా రొట్టెతో పోలిస్తే సద్ది రొట్టెలో తక్కువ కేలరీలు ఉన్నాయి. త్వరగా బరువు తగ్గాలని ప్రయత్నిస్తున్న వారికి సహాయపడుతుంది. అంతేకాదు.. రక్తపోటును కూడా నియంత్రిస్తుంది. మధుమేహ రోగులకు ఉదయం పాలతో మంచి అల్పాహారంగా పనిచేస్తుంది. కానీ, అందులో పంచదార వేసుకోవద్దని గుర్తుంచుకోవాలి. సద్ది రోటీలను తినడం వల్ల కండరాలను బలోపేతం చేస్తుంది. కొందరు హార్డ్ వర్క్ చేస్తుంటారు. వీరికి కూడా ఈ చద్ది రొట్టెలు మంచి ప్రయోజనం చేకూరుస్తాయట.

# ఆరోగ్యంగా ఉండాలంటే...?



మారుతున్న కాలంతో పాటు మనిషి ఆహార పద్ధతులు సైతం మారిపోతున్నాయి.
లప్రస్తుత బిజీ లైఫ్ లో ఎక్కువ శాతం మంది జంక్ ఫుడ్ ను అధికంగా తీసుకుంటున్నారు. శారీరక శ్రమ లేకపోవడంతో పాటు పని ఒత్తిడి, నిద్రలేమి వంటి పలు కారణాల వలన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ లు పెరుగుతున్నాయి. దీని వలన గుండె సంబంధిత సమస్యలతో పాటు స్ట్రోక్, హార్ట్ ఎటాక్, హైపర్ టెన్షన్ వంటి అనారోగ్య సమస్యల ముప్పు వాటిల్లుతుంది. శరీరంలో ఉండే హానికరమైన కొవ్వులు రక్త సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగిస్తాయి.

# మీ వయసు 30 దాటిందా?



ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా ఎన్నో రకాల వ్యాధులు వస్తున్నాయి. చిన్న పెద్ద అందరికీ కూడా వ్యాధులు వస్తున్నాయి. నెగ్లెట్ చేస్తే చిన్న వ్యాధులు పెద్ద వ్యాధులుగా మారుతున్నాయి. అయితే ఆడవారి కంటే పురుషులు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తూ ఉంటారు. అస్సలు పట్టించుకోరు. అనారోగ్య సమస్యల లక్షణాలు కనిపించినా కేర్ చేయరు. ఆ తర్వాత ఆస్పత్రి పాలవ్వాల్సి వస్తుంది. ఇటీవల జరిగిన సర్వేల ప్రకారం.. 30 ఏళ్లు దాటిన పురుషుల్లో కొన్ని రకాల హెల్త్ ప్రాబ్లమ్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయట. వీటిని ప్రారంభంలో గుర్తించకపోతే.. చివరికి ప్రాణాల మీదకే వస్తుంది. ఇంతకీ పురుషులకు 30 ఏళ్లు దాటాక వచ్చే సమస్యలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. 30 ఏళ్లు వచ్చిన తర్వాత పురుషుల్లో ఎముకలు బలహీనంగా మారతాయి. ఈ వయసులో ఆహారం విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే.. శరీరంలో విటమిన్ డి, క్యాల్షియం లోపం ఏర్పడుతుంది. దీంతో కీళ్ల నొప్పులు, ఎముకలకు సంబంధించిన సమస్యలు రావచ్చు. అందుకే 30 సంవత్సరాల వయసులో పురుషులు కాల్షియం కచ్చితంగా తీసుకోవాల్సిందే. అలాగే వ్యాయామం కూడా చేయాలి. ప్రస్తుత కాలంలో ఉన్న ఆహారపు అలవాట్ల కారణంగా శరీరంలో చెడు కొలెస్ట్రాల్ అనేది విపరీతంగా పెరిగిపోతుంది.

# కుండలో నీటిని తాగడం వలన ఇన్ని ప్రయోజనాలా?

సాధారణంగా ఎండాకాలం వచ్చిందంటే చాలు ప్రతి ఒక్కరూ చల్లని నీరు తాగేందుకు మక్కువ చూపిస్తారు. ప్రస్తుత కాలంలో ఫ్రిడ్జ్ వాటర్ ను ఎక్కువగా తాగుతున్నారు. బయట ఎండ వేడిమి ఎక్కువగా ఉండటం వలన.. శరీరంలో ఉన్న నీరంతా చెమట రూపంలో బయటకు వచ్చేస్తుంది. దీని వలన బాడీలో నీటి పరిమాణం తగ్గి డీహైడ్రేషన్ కు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంది. రిఫ్రిజిరేటర్ లో నీళ్లను తాగడం వలన అప్పటివరకు ఉపశమనం లభించినప్పటికీ%శా% జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి పలు సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అయితే ఫ్రిడ్జ్ వాటర్ కు బదులుగా కుండలో నీటిలో తాగితే ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని తెలుస్తోంది. ఎండాకాలంలో మట్టికుండలో నీటిని తాగడం వలన కలిగే ప్రయోజనాలు ఏంటనేది ఇప్పుడు తెలుసుకుందాం..
మట్టి కుండలకు పోరస్ స్వభావం ఉంటుంది. ఇది నీటిలోని మలినాలను ఫిల్టర్ చేసి, శుభ్రం చేయడంలో సహాయపడుతుంది. అదేవిధంగా హానికరమైన బ్యాక్టీరియాను నియంత్రిస్తుంది. కుండలో ఉంచిన నీటి యొక్క పీహెచ్ స్థాయి స్థిరంగా ఉంటుంది. అలాగే మట్టి కుండలో ఉండే కొన్ని స్వభావాలు నీటి ఆమ్లతను తటస్థీకరిస్తాయట. దీని కారణంగా జీర్ణవ్యవస్థ పనితీరు



మెరుగుపడుతుందని నిపుణులు తెలియజేస్తున్నారు. మట్టి కుండల్లో నీటిని తాగడం వలన ఎసిడిటీ, గ్యాస్ మరియు కడుపు ఉబ్బరం వంటి పలు సమస్యలు తగ్గుముఖం పడతాయి. శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దాంతో పాటుగా డీహైడ్రేషన్ ముప్పు కూడా తగ్గుతుంది. అంతేకాదు పలు రకాల శ్వాసకోశ సమస్యలను మట్టి కుండలోని నీరు తాగడం వలన నివారించుకోవచ్చని చెబుతున్నారు. ఎండ వేడిమికి చాలా మంది చర్మం జిడ్డుగా ఉండటంతో పాటు మొటిమలు వంటి సమస్యలు వస్తుంటాయి. మట్టి కుండలోని నీరు తాగడం వలన ఆ సమస్య నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు.





# స్పీడందుకున్న గేమ్‌చేంజర్

మెగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న పొలిటికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'గేమ్‌చేంజర్'. దాదాపు రెండున్నరేళ్లుగా ఈ సినిమా షూటింగ్ జరుగుతూనేవుంది. శంకర్ 'భారతీయుడు' ఫ్రాంచైజీతో బిజీ కావడమే ఈ జాప్యానికి కారణం. అయితే, ఎట్టకేలకు ఈ సినిమా నిర్మాణంలో వేగం పెంచారు దర్శకుడు శంకర్. సునీల్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఆయన నేపథ్యంలో సాగే సన్నివేశాలను చిత్రీకరించారు. తదుపరి షెడ్యూల్ ఈ నెలాఖరు నుంచి షురూ చేశారు. రామ్‌చరణ్ లేని సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లో పూర్తి చేస్తారని సమాచారం. దీనికోసం సెకండ్ యూనిట్‌ను నియమించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో కియారా అద్వానీ, అంజలి కథానాయికలు. శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, నరేశ్, సముద్రఖని, నాజర్, ప్రియదర్శి ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, నిర్మాత: దిల్‌రాజు.

# ప్రభాస్ సలార్ 2లో దసరా విలన్.. క్రేజీ టాక్ నిజమేనా..?



ప్రభాస్ కాంపౌండ్ నుంచి వరుస సినిమాలు లైన్‌లో ఉన్నాయని తెలిసిందే. ఈ గ్లోబల్ స్టార్ హీరో టైటిల్ రోల్‌లో వస్తోన్న యాక్షన్ థ్రిల్లర్ సలార్. ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో రెండు పార్టులుగా వస్తోండగా.. సలార్ పార్టు 1 గతేడాది గ్రాండ్‌గా విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రాబట్టింది. ఈ ఫ్రాంచైజీలో మాలీవుడ్ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో నటిస్తున్నాడని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్టులో మరో మలయాళ స్టార్ యాక్టర్ భాగం కాబోతున్నాడన్న వార్త ఒకటి మూవీ లవర్స్‌లో జోష్ నింపుతోంది. ఇంతకీ ఆ నటుడెవరనుకుంటున్నారా..? నాని హీరోగా నటించిన దసరా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరవడమే కాదు.. ఒక్క సినిమాతో ఇక్కడ సూపర్ పాపులారిటీ సంపాదించుకున్న షైన్ టామ్ చాకో. ఈ క్రేజీ యాక్టర్ ఇప్పుడు సలార్ 2లో ప్రభాస్‌తో స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నాడన్న వార్త ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. మరి ఇదే నిజమైతే షైన్ టామ్ చాకో క్రేజ్ గ్లోబల్ వైడ్‌గా మార్మోగిపోవడం ఖాయమైనట్టే. దీనిపై మేకర్స్ నుంచి ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలి మరి. సలార్ 2ను సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు ప్రశాంత్ నీల్ టీం రెడీ అయిందని, షూటింగ్ మే చివరలో షురూ కానుందని ఇప్పటికే ఓ వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. తాజా టాక్ ప్రకారం సలార్ 2 షూటింగ్ రామోజీఫిలిం సిటీలో షురూ కానుంది. మొదటి షెడ్యూల్ 10 రోజులపాటు కొనసాగనుండగా.. ప్రభాస్, పృథ్వీరాజ్ సుకుమారన్‌పై వచ్చే సన్నివేశాలను చిత్రీకరించనున్నారట. సలార్ 2 షూట్ పూర్తి చేసి 2025 డిసెంబర్‌లో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. హోంబలే ఫిలిమ్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న సలార్ 2లో శృతిహాసన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. శ్రియా రెడ్డి, టిన్ను ఆనంద్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.





# అలాంటి అబ్బాయి కావాలి..

కథానాయికల ప్రేమ, పెళ్లి విషయాల గురించి అభిమానులకు చాలా ఆసక్తి ఉంటుంది. ముఖ్యంగా సదరు నాయిక ప్రేమలో ఉందంటే చాలు శుభవార్త ఎప్పుడు చెబుతుందోనని ఎదురుచూస్తుంటారు. ఇప్పుడు జాన్వీకపూర్ అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నది. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సుశీల్‌కుమార్ షిండే మనవడు శిఖర్ పహారియాతో ఈ భామ ప్రేమలో ఉందని ప్రచారం జరుగుతున్నది. ఇటీవలే ఓ సినిమా ప్రీమియర్ షోకు హాజరైన జాన్వీకపూర్ 'శిఖు' అనే లోగో వున్న నెక్లెస్‌ను ధరించారు. దీంతో ఈ ఇద్దరి మధ్య బంధం నిజమేనని అభిమానులు అనుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తన తాజా చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' ప్రమోషన్‌కు హాజరైన జాన్వీకపూర్ తనకు కాబోయే భర్త ఎలా ఉండాలో చెప్పుకొచ్చింది. 'ఎలాంటి క్లిష్టపరిస్థితుల్లోనైనా నాకు ధైర్యం చెప్పాలి. నా కలల సాకారానికి అండగా నిలవాలి. ఎప్పుడూ నన్ను సంతోషంగా ఉంచాలి. అలాంటి వ్యక్తినే నేను పెళ్లాడతా' అని చెప్పుకొచ్చింది. శిఖర్ పహారియాతో రిలేషన్‌షిప్ గురించి అడగ్గా సమాధానాన్ని దాటవేసింది. క్రికెట్ నేపథ్య కథాంశంతో 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ నెల 31న విడుదల కానుంది.

# భారత్‌లో మొబైల్ ఛార్జీలు పెరగాల్సిందే....!



**న్యూఢిల్లీ :** ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలు ముగియగానే మొబైల్ ఫోన్ రీచార్జ్ బాదుడు షురూ కానుందని వచ్చిన రిపోర్టులకు భారతీ ఎయిర్‌టెల్ సిఇఒ గోపాల్ విట్టల్ వ్యాఖ్యలు బలం చేకూర్చాయి భారత్‌లో మొబైల్ ఛార్జీలు పెరగాల్సిన అవసరం ఉందని గోపాల్ విట్టల్ అన్నారు. ఇతర దేశాలతో పోల్చితే భారత్‌లోనే టెలికం టారీఫ్‌లు తక్కువగా ఉన్నాయన్నారు. ప్రస్తుత సమయంలో వినియోగదారుడి నుంచి సగటు రాబడి (ఎఆర్‌పియు) రూ.300కు చేరాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం రూ.200 పైన ఎఆర్‌పియు ఉందన్నారు. ప్రపంచంలోనే ఇది తక్కువన్నారు. భారతీ ఎయిర్‌టెల్ మార్చి త్రైమాసికం ఫలితాల వెల్లడి అనంతరం బుధవారం గోపాల్ విట్టల్ మాట్లాడుతూ.. పెట్టుబడికి తగిన ప్రతిఫలం పెరగాలంటే టారిఫ్‌లు పెరగాల్సిన అవసరం ఉందన్నారు. 5జి పెట్టుబడులకు ప్రతిఫలం తక్కువగానే ఉందన్నారు. ఇటీవల వొడాఫోన్ ఐడియా రూ.18,000 కోట్ల ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ నిధుల సమీకరణ స్వాగతించదగ్గ పరిణామమని అన్నారు. భవిష్యత్‌లో ఆ సంస్థకు అంతా మంచి జరగాలని కోరుకుంటున్నానని తెలిపారు. దేశంలో మూడు బలమైన ప్రయివేటు టెలికం ఆపరేటర్లతో సేవలు సరిపోతాయని అన్నారు. దీంతో పరోక్షంగా బిఎస్‌ఎన్‌ఎల్‌కు ఎసరు పెట్టాలని సంకేతాలు ఇవ్వడం గమనార్హం. ప్రస్తుత ఎన్నికల ఫలితాల తర్వాత ఛార్జీల పెంపునకు టెలికం కంపెనీలు ప్రణాళికలు వేస్తున్నాయని బ్రోకరేజీ సంస్థ ఆక్సిస్ కాపిటల్ ఓ రిపోర్ట్‌లో తెలిపిన విషయం తెలిసిందే. ప్రస్తుత ధరలపై 25 శాతం వరకు ధరలు పెంచాలని యోచిస్తున్నాయి. టెలికం పరిశ్రమలో పోటీ, టెక్నాలజీ కోసం పెట్టుబడులు పెరిగాయనే సాకుతో ప్రస్తుత ప్రభుత్వ మద్దతుతో టారిఫ్ ధరల పెంపునకు ప్లాన్లు వేస్తున్నాయని వెల్లడించిన విషయం తెలిసిందే. ఆర్థిక సంవత్సరం 2023-24లో భారతీ ఎయిర్‌టెల్ నికర లాభం రూ.7,467 కోట్లుగా నమోదయ్యింది. మరోవైపు ఆదాయం 7.7 శాతం పెరిగి రూ.1,49,982 కోట్లకు చేరింది. మార్చి త్రైమాసికంలో రూ.2,072 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గడిచిన మార్చి త్రైమాసికంలో ఒక్కో వినియోగదారుడిపై కంపెనీకి సగటు రాబడి 8 శాతం పెరిగి రూ.193 నుంచి రూ.209కు చేరిందని గోపాల్ విట్టల్ తెలిపారు.

# 350 పాయింట్లు ఎగబాకిన సెన్సెక్స్......

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం లాభాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు మన సూచీలకు దన్నుగా నిలుస్తున్నాయి.ఉదయం 9:24 గంటల సమయంలో సెన్సెక్స్ 386 పాయింట్లు లాభపడి 73,373 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 110 పాయింట్లు పుంజుకొని 22,310 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.46 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో టెక్ మహీంద్రా, విప్రో, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్, టాటా స్టీల్, ఎం అండ్ ఎం, ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. మారుతీ, పవర్‌గ్రిడ్, టాటా మోటార్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, నెస్లే ఇండియా, ఎల్ అండ్ టీ, సన్‌ఫార్మా, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టీపీసీ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం అక్కడి స్టాక్ మార్కెట్లు రికార్డు గరిష్ఠాలకు చేరాయి. అక్కడి నుంచి సంకేతాలు అందుకున్న ఆసియా-పసిఫిక్ సూచీలు నేడు సానుకూలంగా ట్రేడవుతున్నాయి.





# ఈ కారుపై రూ.1.5 లక్షల డిస్కౌంట్..!



కార్ల మార్కెట్లో స్కోడా కంపెనీకి ప్రత్యేక పేరు ఉంది. 100కు పైగా దేశాల్లో ఉన్న ఈ కంపెనీ నుంచి వివిధ మోడళ్లు మార్కెట్లోకి వచ్చాయి. స్కోడా నుంచి వచ్చిన ప్రతీ కారు ప్రత్యేకతను సంతరించుకుంటుంది. తాజాగా స్కోడా కంపెనీ కారు వాడే వారికి గుడ్ న్యూస్ చెప్పింది. ఈ కంపెనీకి చెందిన కొన్ని మోడళ్లపై డిస్కౌంట్లు ప్రకటిస్తున్నట్లు తెలిపింది. అయితే కాంప్లిమెంటరీ 3 ఇయర్స్, 45 వేల కిలోమీటర్ల వరకు మాత్రమే వర్తిస్తుంది. ఏయే కార్లపై ఎలాంటి తగ్గింపులు ఉన్నాయో చూద్దాం..స్కోడా కంపెనీ నుంచి రిలీజ్ అయిన స్కోడా కుషక్ భారత్ లో అత్యంత ప్రజాదరణ పొందింది. ఎస్ యూవీ మోడల్ అయిన దీనిని మార్కెట్లో 11.99 నుంచి 20.49 లక్షల వరకు విక్రయిస్తున్నారు. ఈ కారుపై రూ1.25 లక్షల వరకు డిస్కౌంట్ ఇవ్వనున్నారు. కుషాక్ మొత్తం నాలుగు వేరియంట్లలో లభించనుంది. 1.0 లీటర్ పెట్రోల్, 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్లు కలిగిన ఈ మోడల్ కు సంబంధించిన డిస్కౌంట్ ఈ నెల చివరి వరకు మాత్రమే ఉంటుంది. స్కోడా స్లావియా ధర మార్కెట్లో 11.63 లక్షల నుంచి రూ.19.12 లక్షల వరకు విక్రయించనున్నారు. దేశీయ మార్కెట్లో స్లావియాకు మంచి పేరు ఉంది. అయినా దీని కొనుగోలుపై 1.5 లక్షల వరకు తగ్గింపును ప్రకటించారు. సూపర్ డిజైన్ తో పాటు ఆకట్టుకునే ఫీచర్స్ ఉన్న స్లావియాపై భారీ డిస్కౌంట్ తో రానుంది. త్వరలో మార్కట్లోకి స్కోడా కుషాక్,స్లావియాలు ఫేస్ లిఫ్ట్ లు రాబోతున్నాయి. అయితే ఇప్పటికే ఉన్న వాటిపై డిస్కౌంట్లు ప్రకటించడం ఆకర్షణీయంగా మారింది.

# భారీగా పెరిగిన బంగారం ధర....!




బంగారం, వెండి ధరలు మరోసారి భారీ షాక్ ఇచ్చాయి.. వరుసగా మూడు రోజులు తగ్గినట్లే తగ్గి భారీ స్థాయిలో పెరిగాయి. వెండి సైతం అదేస్థాయిలో పెరిగింది. అంతర్జాతీయ స్థాయిలో బంగారం స్పాట్ గోల్డ్ ఔన్స్ ధర 2395 డాలర్లుగా కొనసాగుతోంది. స్పాట్ సిల్వర్ ధర 29.73 డాలర్ల వద్ద నమోదవుతోంది. ఈ నేపథ్యంలో దేశీయంగా బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.. బులియన్ మార్కెట్ ప్రకారం.. మే16న ఓవరాల్ గా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.67,150గా నమోదైంది. 24 క్యారెట్ల పసిడి 10 గ్రాములకు రూ.73,250 గా ఉంది. మే 15న 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ..66,750తో విక్రయించారు. 10 గ్రాముల బంగారానికి బుధవారంతో పోలిస్తే రూ.430 పెరిగింది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.. న్యూఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.67,310 ఉండగా.. 24 క్యారెట్ల గోల్డ్ రూ.73,410గా నమోదైంది.ఆర్థిక రాజధాని ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.67,150 కొనసాగుతోంది. 24 క్యారెట్లు రూ.73,260 పలుకుతోంది. చెన్నైలో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.67,250 పలుకుతోంది. 24 క్యారెట్ల 10 గ్రాములకు రూ.73,370తో విక్రయిస్తున్నారు. బెంగుళూరులో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.67,150 పలుకుతోంది. 24 క్యారెట్ల 10 గ్రాములకు రూ.73,260తో విక్రయిస్తున్నారు. హైదరాబాద్ లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.66,150తో విక్రయిస్తున్నారు. 24 క్యారెట్ల 10 గ్రాములకు రూ.73,260తో విక్రయిస్తున్నారు. బంగారంతో పాటు వెండి ధరలు కూడా పెరిగాయి. గురువారం ఓవరాల్ గా కిలో వెండి రూ.87,600గా నమోదైంది. బుధవారంతో పోలిస్తే గురువారం రూ.400 పెరిగింది . ఈ నేపథ్యంలో ప్రస్తుతం న్యూ ఢిల్లీలో కిలో వెండి రూ.87,600గా ఉంది. ముంబైలో రూ.87,600, చెన్నైలో రూ.91,100, బెంగుళూరులో 86,600, హైదరాబాద్ లో రూ.91,100తో విక్రయిస్తున్నారు. మే16న ఓవరాల్ గా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.67,150గా నమోదైంది. 24 క్యారెట్ల పసిడి 10 గ్రాములకు రూ.73,250 గా ఉంది. మే 15న 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ..66,750తో విక్రయించారు. 10 గ్రాముల బంగారానికి పోలిస్తే గురువారం రూ.430 పెరిగింది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.. న్యూఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.67,310 ఉండగా.. 24 క్యారెట్ల గోల్డ్ రూ.73,410గా నమోదైంది.

# ఎఫ్‌డిలపై ఎస్‌బిఐ వడ్డీ రేట్ల పెంపు......!





**న్యూఢిల్లీ :** దిగ్గజ విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఫిక్స్‌డ్ డిపాజిట్‌దారులకు శుభవార్త తెలిపింది. ఎఫ్‌డిలపై వడ్డీ రేట్లను పెంచింది. సవరించిన వడ్డీ రేట్లు మే 15 నుంచి అమల్లోకి వచ్చాయని ఆ సంస్థ వెబ్‌సైట్‌లో తెలిపింది. కాలపరిమితిని బట్టి రూ.2 కోట్ల లోపు రిటైల్ డిపాజిట్లపై గరిష్టంగా 75 బేసిక్ పాయింట్ల (0.75 శాతం) మేరకు వడ్డీ పెంచింది. 46 రోజుల నుంచి 179 రోజుల గడువు గల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 4.75 శాతం నుంచి 5.50 శాతానికి వడ్డీ రేటును చేర్చగా.. సీనియర్ సిటిజన్లకు 5.25 నుంచి 6 శాతానికి పెరిగింది. 180-210 రోజుల గడువు గల ఎఫ్‌డిలపై 6 శాతం, సీనియర్ సిటిజన్లకు 6.5 శాతం వడ్డీ అందించనున్నట్లు పేర్కొంది.

# కేవైసీ ధ్రువీకరణ మరింత సులభం...!




కేవైసీ రిజిస్ట్రేషన్ ఏజెన్సీ (కేఆర్‌ఏ)ల ద్వారా కేవైసీ (మీ ఖాతాదారు గురించి తెలుసుకో) వివరాల ధ్రువీకరణ ప్రక్రియను సులభతరం చేయాలని సెబీ నిర్ణయం తీసుకుంది.ఈ కొత్త విధానంలో శాశ్వత ఖాతా సంఖ్య (పాన్), పేరు, చిరునామా, మొబైల్ నంబరు లాంటి వివరాలను ఆదాయపు పన్ను విభాగం డేటాబేస్, ఆధార్ ఎక్స్ఎమ్ఎల్, డిజిలాకర్/ఎం-ఆధార్ లాంటి అధికారిక డేటాబేస్ ద్వారా కేఆర్‌ఏలు ధ్రువీకరిస్తాయి. అధికారిక డేటాబేస్ ప్రకారం కేవైసీ వివరాలు సరిగ్గా ఉన్నట్లు తేలితేనే, వాటిని ధ్రువీకరించిన వివరాలుగా పరిగణిస్తారని సిగ్నిజీ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ అంకిత్ రతన్ తెలిపారు.

# విదేశీ మదుపర్లలో ఎన్నికల గుబులు



**న్యూఢిల్లీ :** దశాబ్దకాలంలోనే తొలిసారిగా భారత స్టాక్ మార్కెట్లపై విదేశీ మదుపర్లు నిరాశావాద దృక్పథంతో ఉన్నట్లు కనిపిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమికి, అంచనా కంటే తక్కువ సీట్లు రావొచ్చనే ఊహాగానాలే ఇందుకు నేపథ్యం. బ్లూమ్‌బర్గ్ సేకరించిన గణాంకాల ప్రకారం... విదేశీ మదుపర్లు నికరంగా 2,13,224 కాంట్రాక్టులకు షార్ట్ పొజిషన్లలో ఉన్నారు. 2012 తర్వాత ఇంత ఎక్కువ సంఖ్యలో వాళ్లు షార్ట్ పొజిషన్లలో ఉండటం మళ్లీ ఇప్పుడే కావడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభం (ఏప్రిల్) నుంచి చూస్తే, భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు 4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.33,200 కోట్ల) నిధులను వెనక్కి తీసుకున్నారు.
ఎన్నికల ఫలితాలపై విదేశీ మదుపర్లు అప్రమత్తతతో ఉన్నారనే విషయాన్ని ఈ రెండు పరిణామాల ఆధారంగా అర్థం చేసుకోవచ్చు. సార్వత్రిక ఎన్నికల తొలి 4 దశల పోలింగ్‌లో, గతం కంటే ఓటింగ్ శాతం తగ్గడంతో మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీకి సీట్లు తగ్గొచ్చనే ఊహాగానాలు వస్తున్నాయి.

# ఎగిసిన భారత వాణిజ్య లోటు...!



**న్యూఢిల్లీ :** ప్రపంచ మార్కెట్‌లో భారత సరుకులకు డిమాండ్ తగ్గుతోంది. మరోవైపు దేశ దిగుమతులు మాత్రం అమాంతం పెరుగుతున్నాయి. దీంతో భారత వాణిజ్య లోటు ఎగిసిపడుతోంది. ప్రస్తుత ఏడాది ఏప్రిల్‌లో సరుకుల వాణిజ్య లోటు 19.1 బిలియన్ డాలర్లకు చేరిందని వాణిజ్య శాఖ సెక్రటరీ సునీల్ బర్త్వాల్ బుధవారం తెలిపారు. ఇంతక్రితం మార్చిలో 15.6 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు చోటు చేసుకుంది. కాగా.. గడిచిన ఏప్రిల్‌లో భారత ఎగుమతులు కేవలం 1.06 శాతం పెరిగి 34.99 బిలియన్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలలో 34.62 బిలియన్ల ఎగుమతులు జరిగాయి. ఇదే సమయంలో 49.06 బిలియన్లుగా ఉన్న దిగుమతులు మాత్రం.. 2024 ఏప్రిల్‌లో మాత్రం 10 శాతం ఎగిసి 54.09 బిలియన్లకు చేరాయని ప్రభుత్వ గణంకాలు వెల్లడించాయి. "కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభ గణంకాలు బాగున్నాయి. ఏడాది మొత్తం ఇలాగే కొనసాగాలని ఆశిద్దాం." అని భర్త్వాల్ పేర్కొన్నారు. 2024 మార్చిలో ఎగుమతులు స్వల్పంగా తగ్గి 41.68 బిలియన్లుగా నమోదయ్యాయి. పసిడి ధరలు ఎగిసిపడుతున్నప్పటికీ.. ఆ లోహం దిగుమతులు అమాంతం పెరిగాయి. గడిచిన నెలలో బంగారం దిగుమతులు రెట్టింపు అయ్యాయి.

## ఆదాయ పెంపుపై రేవంత్ దృష్టి

# పెరగనున్న భూముల ధరలు

తెలంగాణలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కీలక నిర్ణయాలు తీసుకుంటూ దూసుకుపోతుంది. అటు పాలన విషయంలో ఇటు పథకాల విషయంలోనూ దూకుడు ప్రదర్శిస్తోంది. ఈ క్రమంలోనే.. సీఎం రేవంత్ రెడ్డి మరో కొత్త నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారు. తెలంగాణలో భూముల మార్కెట్ విలువ సవరణపై అధికారులకు రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. దీంతో.. రేవంత్ రెడ్డి తీసుకునే నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగంపై ప్రభావం పడే అవకాశం ఉంది.
సంచలన నిర్ణయాలతో పాలనలో తన మార్క్ చూపిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. మరో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ పెంపు మార్గాలపై సీఎం రేవంత్ రెడ్డి ఫోకస్ పెట్టారు. రాష్ట్రంలోని భూముల మార్కెట్ విలువ సవరణపై అధికారులకు రేవంత్ కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఆదాయం పెంచే ప్రక్రియపై సీఎం .. సంబంధిత శాఖ అధికారులతో సచివాయలంలో సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం 2021లో భూముల విలువను, రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచిన విషయం తెలిసిందే. ఈ విషయంపై స్పందించిన రేవంత్ రెడ్డి.. ఇప్పటికీ చాలాచోట్ల భూముల మార్కెట్ విలువకు, క్రయ విక్రయ ధరలకు భారీ తేడా ఉందని అభిప్రాయపడ్డారు. భూముల వాస్తవ మార్కెట్ విలువకు, ప్రభుత్వం నిర్దేశించిన భూముల మార్కెట్ విలువకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసమే ఇందుకు కారణమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్కెట్ విలువ కంటే భూముల వాస్తవ మార్కెట్ విలువ అనేక రెట్లు ఎక్కువగా ఉందని, ప్రభుత్వం నిర్దేశించిన మార్కెట్ విలువను సవరించడం ద్వారా దీనిని హేతుబద్ధీకరించాలని ఆయన అన్నారు.

**2021లో సవరణ**

2014 జూన్‌లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2021 వరకు భూముల మార్కెట్ విలువను పెంచని రాష్ట్ర ప్రభుత్వం.. అవిభక్త ఏపీలో 2013లో సవరించిన మార్కెట్ విలువలు తెలంగాణలో 2021 వరకు ఎనిమిదేళ్లపాటు అమల్లో ఉన్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూముల మార్కెట్ విలువ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, స్టాంప్ డ్యూటీని తెలంగాణలో మొదటిసారిగా జూలై 2021లో పెంచింది. ప్రభుత్వం మళ్లీ ఫిబ్రవరి 2022 నుండి భూముల మార్కెట్ విలువను, రిజిస్ట్రేషన్ ఛార్జీలను రెండవసారి పెంచింది. అయినప్పటికీ, భూముల వాస్తవ మార్కెట్ విలువకు, ప్రభుత్వ భూముల విలువలకు మధ్య భారీ అంతరం ఉందని సీఎం భావించారు.

**ఏడాదికి ఒకసారి సవరించాలి..**

నిబంధనల ప్రకారం ఏడాదికి ఒకసారి భూముల మార్కెట్ విలువను సవరించాల్సి ఉంటుందని.. ఆ క్రమంలో ధరల సవరణకు చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర రాబడి పెంపుతో పాటు స్థిరాస్థి, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా భూముల మార్కెట్ ధరల సవరణ జరగాలని సీఎం రేవంత్ తెలిపారు. స్టాంప్ డ్యూటీ తగ్గించడమా లేక పెంచడమా అన్న విషయంలో ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను అధ్యాయనం చేయాలని అధికారులకు సూచించారు.

**సీఎం ఆదేశాలు**

వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్లకు ధరలను సవరించాల్సిన ప్రాంతాలను గుర్తించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. శాస్త్రీయంగా, రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ నిబంధనల ప్రకారం ధరల సవరణను పాటించాలని తెలిపారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంతో పాటు రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు భూముల మార్కెట్ ధరలను సవరించాలని రేవంత్ రెడ్డి సూచించారు.

**ఉద్యోగుల కొరత ఉండొద్దు**

మరోవైపు.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగుల కొరత లేకుండా సర్దుబాటు చేయాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. అద్దె భవనాల్లో ఉన్న కార్యాలయాల కోసం అధునాతన మోడల్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మించాలని తెలిపారు. మరోవైపు.. సామాన్యులకు ఇసుక కొరత రాకుండా అక్రమ రవాణాను, లీకేజీలను అరికట్టాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.

**పుంజుకోవడమా.. పడిపోవడమా?**

సీఎం రేవంత్ రెడ్డి తీసుకునే నిర్ణయంపై రియల్ ఎస్టేట్ రంగంపై ప్రభావం పడే అవకాశం ఉంది. భూముల మార్కెట్ విలువ సవరణపై తీసుకునే నిర్ణయం.. రియల్ ఎస్టేట్ రంగం మరింత పుంజుకోవటామా.. మళ్లీ పడిపోవటామా అనేది ఆధారపడి ఉంది. అయితే.. రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ రంగం నుంచి వచ్చిన వ్యక్తే కాబట్టి ఆ రంగంపై పూర్తి అవగాహన ఉండటంతో.. ఎలాంటి చర్యలు తీసుకుంటే ఏమవుతుందన్నది పూర్తి పట్టు ఉండే అవకాశం ఉంది. దీంతో.. రియల్టర్లందరూ.. సీఎం రేవంత్ రెడ్డి తీసుకునే నిర్ణయంపై ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు.

# 2019 కంటే ఎక్కువ సీట్లు గెలుస్తాం: సజ్జల



రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో విజయంపై తమకు పూర్తి విశ్వాసంతో ఉందని వైసిపి ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. 2019లో వచ్చిన సీట్ల కంటే ఈ సారి ఎక్కువ సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సజ్జల మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబుకు ఆయన మీద ఆయనకే నమ్మకం? లేదన్నారు. చంద్రబాబు పూర్తిగా నెగిటివ్ క్యాంపెన్ చేశారని విమర్శించారు. జగన్ ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లిందని చెప్పారు. ఓటింగ్ సరళిని చూసి ప్రభుత్వ వ్యతిరేక ఓటు అనుకోవద్దని ఆయన పేర్కొన్నారు. కేంద్రంతో కలిసి కొంతమంది అధికారులను కుట్రపూరితంగా చంద్రబాబు తప్పించారని ఆరోపించారు. అధికారుల మార్పుతో%ొ%టిడిపి కార్యకర్తలకు పోలీసులు సహకరించారని.. దాంతో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాని సజ్జల చెప్పారు.

## అజ్ఞాతంలో కాదు...

# హైదరాబాద్ లో... క్లారిటీ ఇచ్చిన పిన్నెల్లి

ఏపీ సార్వత్రిక ఎన్నికల అనంతరం మాచర్ల వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వ్యవహారం సంచలనంగా మారింది. మాచర్ల నియోజకవర్గంలో జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో పిన్నెల్లి సోదరులను గృహ నిర్బంధంలో చేశారు. కానీ గురువారం రాత్రి నుంచి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి ఇద్దరూ కనిపించడం లేదు. దీంతో ఇద్దరూ అజ్ఞాతంలోకి వెళ్లారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్పందించారు. తాము అజ్ఞాతంలోకి వెళ్లినట్లుగా జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. తమకు ఎక్కడికీ పారిపోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. వ్యక్తిగత పనుల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లానని వెల్లడించారు. అలాగే తమపై ఎలాంటి కేసులు కూడా లేవని స్పష్టం చేశారు. ఈ నెల 13 ఏపీలో ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత మాచర్లలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ, టీడీపీ శ్రేణులు పరస్పరం దాడులకు దిగడంతో ఆ ప్రాంతమంతా రణరంగంగా మారింది. ఈ ఘటనను సీరియస్‌గా



తీసుకున్న కేంద్ర ఎన్నికల సంఘం పల్నాడు జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ విధించింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో అల్లర్లు జరగడంతో జిల్లా ఎస్పీని సస్పెండ్ చేసింది. కలెక్టర్‌ను బదిలీ చేసింది. అలాగే పలువురు ఉన్నతాధికారులపై శాఖాపరమైన చర్యలకు ఆదేశించింది. అలాగే సిట్ దర్యాప్తునకు ఆదేశించింది. ఈ క్రమంలోనే పిన్నెల్లి సోదరులను గృహ నిర్బంధం చేశారు. అయితే గన్‌మెన్లను కూడా వదిలేసి వారిద్దరూ ఎక్కడికో వెళ్లిపోయారు. ఈ పరిణామంతో పిన్నెల్లి గన్‌మెన్లు ఉన్నతాధికారులను కలిసి సమాచారం అందించారు. దీంతో కారంపూడి అల్లర్ల నేపథ్యంలో అరెస్టు చేస్తారనే భయంతోనే వాళ్లిద్దరూ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని ప్రచారం మొదలయ్యింది. ఈ నేపథ్యంలోనే పిన్నెల్లి సోదరులు స్పందించారు.

# నెంబర్ ప్లేట్ లేకుంటే ద్విచక్ర వాహనాలు సీజ్

హైదరాబాద్: ఇటీవల హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్ కేసులు ఎక్కువయ్యాయి. రోడ్డుపై ఒంటరిగా వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని కొందరు చైన్ స్నాచర్లు మెడలో వస్తువులు కట్టేస్తున్నారు. ఒక్కోసారి మహిళలు తీవ్రంగా గాయపడడమే కాదు.. మృత్యువాత పడుతున్న ఘటనలు అనేకం వెలుగులోకి వస్తున్నాయి. అలాంటి వారిని పట్టుకోవాలంటే పోలీసులకు నెంబర్ ప్లేట్లు చాలా ముఖ్యం. అయితే ఇటీవల ఇలాంటి సందర్భాల్లో సీసీ కెమెరాలను పరిశీలించగా చాలా మంది నంబర్ ప్లేట్ లేని వాహనాలను నడుపుతున్నట్లు తేలింది. కాగా దొంగలు నడిపే బైక్స్, కార్ల నెంబర్ ప్లేట్ కనిపించకుండా చేస్తు.. అర్థం కాని నెంబర్ల ఉపయోగిస్తున్నారు. దీంతో దొంగలను పట్టుకోవడం పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. ఈ క్రమంలో హైదరాబాద్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలను ఎక్కడపడితే అక్కడ సీజ్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. సెంట్రల్ జోన్ డీసీపీ ఆధ్వర్యంలో సైఫా బాద్ పోలీసులు చేపట్టిన




డ్రైవ్‌లో నంబర్ ప్లేట్లు లేని పలు వాహనాలను నేడు సీజ్ చేశారు. తొలిరోజు 20కి పైగా బైక్‌లను సీజ్ చేశారు.

# రాహుల్‌ను మీ చేతుల్లో ఉంచా

## - రాయ్‌బరేలీ ఓటర్లతో సోనియా



కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ శుక్రవారం నాడు రాయ్‌బరేలీ ప్రజలకు ఉద్వేగభరితమైన విజ్ఞప్తి చేశారు. రాహుల్ గాంధీకి వారు తన పట్ల చూపిన ప్రేమ, ఆప్యాయతలను అందించాలని కోరారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తన కుమారుడిని ప్రజలకు అప్పగిస్తున్నట్లు అన్నారు. కాంగ్రెస్ నేతలు ప్రియాంక గాంధీ వాద్రా, రాహుల్ గాంధీలతో కలిసి రాయ్‌బరేలీలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడుతూ.. "నా జీవితమంతా మీ ప్రేమ, ఆశీర్వాదాలతో నిండిపోయింది. మీ ప్రేమ నన్ను ఒంటరిగా భావించనీయదు. మీరు నాకు అన్నీ ఇచ్చారు. నా కొడుకును మీకు అప్పగిస్తున్నాను. మీరు నన్ను మీ స్వంతంగా భావించినట్లే, రాహుల్‌ను మీ స్వంతంగా పరిగణించండి. రాహుల్ మిమ్మల్ని నిరాశపరచడు" అని భావద్వేగ విజ్ఞప్తి చేశారు. రాహుల్ గాంధీ లోక్‌సభ ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచి బీజేపీ అభ్యర్థి దినేష్ ప్రతాప్ సింగ్‌పై పోటీ చేస్తున్నారు. సోనియాగాంధీ రాజ్యసభకు వెళ్లడానికి ముందు రెండు దశాబ్దాల పాటు ఈ స్థానం నుండి గెలిచారు. రాయ్‌బరేలీ ప్రజలు తనకు 20 ఏళ్ల పాటు ఎంపీగా సేవలందించే అవకాశం కల్పించడమే తన జీవితంలో అతిపెద్ద ఆస్తి అని గాంధీ అన్నారు. రాయ్‌బరేలీ తన కుటుంబమని, అదే విధంగా అమేథీ కూడా తన ఇల్లు అని పేర్కొన్న గాంధీ, "నా జీవితంలోని సున్నితమైన జ్ఞాపకాలు, కుటుంబ మూలాలు గత 100 సంవత్సరాలుగా ఈ మట్టితో ముడిపడి ఉన్నాయి. అని అన్నారు. కాగా, ర్యాలీని ఉద్దేశించి రాహుల్ గాంధీ మాట్లాడుతూ... జూన్ 4న ప్రభుత్వం ఏర్పడుతుందని, జూలై 4న లక్షలాది కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో 8,500 జమ అవుతుందన్నారు. ఒకసారి కాదు, తరువాతి నెలల్లో కూడా" అని అన్నారు. భారతదేశంలో కోటి మందిని కోటీశ్వరులను తయారు చేయాలి.. 'నరేంద్ర మోదీ 22 మందిని బిలియనీర్లుగా మార్చారు, మేం కోట్లాది మందిని కోటీశ్వరులను చేస్తాం' అని రాహుల్ గాంధీ అన్నారు.

# త్వరలో గ్రూప్ 4 అభ్యర్థుల సర్టిపికెట్ల వెరిఫికేషన్

లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగియడంతో టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాల భర్తీపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే గ్రూప్-4 అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై టీఎస్‌పీఎస్సీ తాజాగా అప్‌డేట్ ఇచ్చింది. గ్రూప్-4 ఉద్యోగాల భర్తీకి సంబంధించి త్వరలోనే అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు వెల్లడించింది. గ్రూప్-4 అభ్యర్థుల జనరల్ ర్యాంకింగ్ జాబితాను ఈ ఏడాది ఫిబ్రవరి 9న రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. జనరల్ అభ్యర్థులను 1:3 నిష్పత్తిలో, పీడబ్ల్యూడీ అభ్యర్థులను 1:5 నిష్పత్తిలో




పిలవనున్నారు. అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లు సిద్ధం చేసుకొని పెట్టుకోవాలని టీఎస్‌పీఎస్సీ సూచించింది. కమ్యూనిటీ, నాన్ క్రిమిలేయర్, స్టడీ సర్టిఫికేట్స్(1వ తరగతి నుంచి ఏడు వరకు), రిజర్వేషన్ కలిగి ఉంటే దానికి సంబంధించిన సర్టిఫికెట్లు, ఏజ్ రిలాక్సేషన్, క్వాలిఫికేషన్ సర్టిఫికెట్లు అందుబాటులో ఉంచుకోవాలని టీఎస్‌పీఎస్సీ సూచించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో ఏ సర్టిఫికెట్ లేకున్నా రిజెక్ట్ అవుతారు అదనపు టైమ్ ఇవ్వడం ఉండదని టీఎస్‌పీఎస్సీ తెలిపింది.

# టీఎస్‌ఆర్టీసీకి భారీగా ఆదాయం



హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలు టీఎస్‌ఆర్టీసీకి భారీగా ఆదాయం తెచ్చిపెట్టాయి. ఎన్నికల సమయంలో 2,500 పైచిలుకు బస్సులను రెండు తెలుగు రాష్ట్రాలకు ఆర్టీసీ నడిపించింది. తెలంగాణలో సుమారు 1,500 బస్సులు, ఆంధ్రపదేశ్‌కు దాదాపు వెయ్యికి పైగా బస్సులను తిప్పింది. జేబీఎస్?, ఎంబీబీఎస్? వంటి ప్రధాన బస్టాండ్?లతో పాటు ఎల్బీనగర్, ఉప్పల్, కూకట్‌పల్లి, మియాపూర్, ఆరాంఘర్ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడిపించింది. దీంతో రవాణా సంస్థకు 23 గంటల్లోనే పెద్దఎత్తున ఆదాయం సమకూరింది. పోలింగ్ రోజైన ఈ నెల 13న ఆర్టీసీ బస్సుల్లో 54 లక్షల మంది ప్రయాణించారు. తద్వారా సంస్థకి రూ. 24.22 కోట్ల ఆదాయం సమకూరింది. ఇక ఎన్నికల తెల్లారి 54 లక్షల మంది ప్రయాణించారు. టికెట్ కొనుగోలు చేసిన వారి ద్వారా ఆదాయం రూ. 15 కోట్లు సమకూరాయని అధికారులు తెలిపారు. ఇందులో మహాలక్ష్మి ఉచిత ప్రయాణంతో రూ. 9 కోట్లు ఉన్నాయని వెల్లడించారు. అయితే ఈ మొత్తాన్ని ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

# ఆస్తి కోసం తల్లి అంత్యక్రియలు ఆపారు



తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తి ఎక్కడ తమకు దక్కకుండా పోతుందనే ఆవేదనతో మూడు రోజులుగా తల్లి అంత్యక్రియలు చేయకుండా మృతదేహాన్ని ఇంటి ముందే ఉంచుకుని పిల్లలు పంచాయితీకి ఎక్కిన వింత ఘటన సూర్యపేటలో చోటుచేసుకుంది. సూర్యపేట జిల్లా నేరేడుచర్ల మండలం కందులవారి గూడెం లక్ష్మమ్మ అనే మహిళ నివాసం ఉంటుంది. లక్ష్మమ్మకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. ఓ కుమారుడు చాలా కాలం క్రితమే మృతి చెందగా.. కూతుళ్ళ వద్దే ఉంటుంది లక్ష్మమ్మ. వీరి కోసం బాగానే ఆస్తులు సంపాదించింది. అయితే ఈ ఆస్తులే ఆమె అంత్యక్రియలకు అడ్డుగా మారాయి. కొద్దిరోజుల క్రితం తన కూతురు ఇంటికి వెళ్లిన లక్ష్మమ్మ ప్రమాదవశాత్తు జారీ పడింది. దీంతో లక్ష్మమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మమ్మను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మూడు రోజుల క్రితమే మృతి చెందింది. అయితే అనారోగ్యంతో చికిత్స పొందుతూ లక్ష్మమ్మ మృతి చెందడంతో కొడుకు, కూతుళ్లు ఆస్తి పంపకాలు పూర్తయ్య వరకు అంబులెన్స్ ను తరలించేది లేదని తేల్చిచెప్పారు దీంతో లక్ష్మమ్మ వద్ద ఉన్న 21 లక్షల రూపాయల్లో ఆరు లక్షలు వైద్య ఖర్చులకు ఖర్చు చేయగా మిగిలిన 15 లక్షల రూపాయలను కొడుకు తీసుకున్నట్లు తెలుస్తోంది. మృతురాలి వద్ద ఉన్న 20 తులాల బంగారాన్ని ముగ్గురు కూతుళ్లు సమానంగా పంచుకున్నారు. పంపకాలు సమానంగా.. సమస్య లేకుండా ముగిసినా.. అంత్యక్రియలు చేయాల్సిన కొడుకు చివరి క్షణంలో కొర్రీ పెట్టడంతో అంత్యక్రియలు నిలిచిపోయాయి. అంత్యక్రియలకు అయ్యే ఖర్చును సమానంగా భరించాలని... అలా జరిగితేనే తలకొరివి పెడతామని తేల్చి చెప్పడంతో అంత్యక్రియలు నిలిచిపోయాయి. దీంతో అంతక్రియల ఖర్చు వివాదం తల్లి అంత్యక్రియలు నిలిచిపోయేలా చేసింది. అంత్యక్రియల ఖర్చు పంచాయతీ కొడుకు, కుమార్తెల మధ్య గొడవకు కారణమైంది.. దీంతో అంత్యక్రియలు ఆగిపోగా ఫ్రీజర్ లోనే లక్ష్మమ్మ మృతదేహం ఉండిపోయింది.




Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com